మోహినీరూపుడైన పట్టాభిరాముడు

● సూర్య, చంద్రప్రభ వాహనాలపై సీతారామలక్ష్మణులు



వాల్మీకిపురం, ఏప్రిల్ 16: వాల్మీకిపురం పట్టాభిరాముడి సాలకట్ల బ్రహ్మోత్సవాలలో భాగంగా మంగళవారం స్వామి వారి మోహినీ అవతారం భక్తులను ఆకట్టుకుంది. టీటీడీ ఆధ్వర్యంలో ఉదయం సుప్రభాతసేవ, అభిషేకం, అర్చన, తోమాలసేవలతో ఆలయంలో మూలవర్లకు ప్రత్యేక పూజలు జరిగాయి. అనంతరం ఆలయంలో యాగశాల వైదిక కార్యక్రమాల అనంతరం ఉత్సవమూర్తులకు వేదపండితుల మంత్రోచ్చారణల నడుమ స్నపనతిరుమంజనం వేడుకగా సాగింది. ఉత్సవాలలో భాగంగా సూర్య చంద్ర ప్రభ వాహనాలపై సీతారామలక్ష్మణులకు విశేష పూజలు చేసి పురవీధుల్లో ఊరేగించారు. అనంతరం రాత్రి మోహినీ అవతారంలో పట్టాభిరాముడికి విశేష అలంకరణలు చేసి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. ఈ సందర్భంగా టీటీడీ ఆధ్వర్యంలో సాంస్కృతిక కార్యక్రమాలు, మహిళల చలిపిండి దీపారాధనలు విశేషంగా ఆకట్టుకున్నాయి. కార్యక్రమాలలో టీటీడీ డిప్యూటీ ఈవో వరలక్ష్మి, ఏఈవో గోపీనాథ్, సూపరింటెండెంట్ వెంకటస్వామి, ఆగమ సలహాదారులు శ్రీనివాసాచార్యులు, ఆలయ అధికారులు కృష్ణమూర్తి, నాగరాజు, అర్చకులు సాలిగ్రామ శ్రీనివాసాచార్యులు, కృష్ణప్రసాద్, కృష్ణరాజు, భాషికాచార్యులు, రామ్‌గోపాల్ బృందం, ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు. పట్టాభిరాముడి బ్రహ్మోత్సవాలలో భాగంగా బుధవారం ఉదయం స్నపనతిరుమంజనం, సాయంత్రం ఊంజల్‌సేవ, రాత్రికి సీతారాముల కల్యాణం, గరుడ వాహన సేవ, నగరోత్సవ కార్యక్రమాలు జరగనున్నాయి.



మోహినీ అవతార రూపుడైన పట్టాభిరాముడు

కోదండరాముడే.. వచ్చేనురా..

● బ్రహ్మోత్సవాలకు శాస్త్రోక్తంగా అంకురార్పణ
● నేడు ధ్వజారోహణం
● అన్ని ఏర్పాట్లు పూర్తి చేసిన టీటీడీ
● విద్యుద్దీపకాంతుల్లో మెరిసిపోతున్న ఆలయం



రంగమండపంలో ఉత్సవమూర్తులకు ప్రత్యేక పూజలు చేస్తున్న అర్చకులు



ప్రత్యేక అలంకరణలో సీతారామలక్ష్మణుల ఉత్సవ మూర్తులు

ఒంటిమిట్ట, ఏప్రిల్ 16: ఆంధ్రా అయోధ్య ఒంటిమిట్ట కోదండరామస్వామి ఆలయంలో శ్రీరామనవమి బ్రహ్మోత్సవాలకు మంగళవారం రాత్రి శాస్త్రోక్తంగా అంకురార్పణ జరిగింది. మంగళవారం ఉదయం సుప్రభాతంతో స్వామి వారిని మేల్కొలిపి పరివార దేవతలకు తిరుమంజనం నిర్వహించారు. అనంతరం మూలవరులకు వ్యాసాభిషేకం, ఆరాధన, అర్చన చేపట్టారు. సాయంత్రం అర్చకుల వేదమంత్రాల నడుమ శాస్త్రోక్తంగా అంకురార్పణ చేశారు. ఇందులో భాగంగా సీతారామలక్ష్మణ ఉత్సవ మూర్తులను సర్వాంగసుందరంగా అలంకరించి ప్రత్యేక వేదికపై కొలువుదీర్చి విష్వక్సేన పూజ, కలశప్రతిష్ఠ, కలశపూజ, వాసుదేవ పుణ్యాహవచనం, కంకణధారణ చేశారు. అనంతరం అర్చకులు రామాలయంలోని పుట్ట నుంచి పుట్టమన్ను శాస్త్రీయంగా సేకరించి రామాలయ ప్రాంగణంలోని హోమగుండంలో ఉంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. బ్రహ్మోత్సవాలలో కేరళ వాయిద్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఉత్సవాల సందర్భంగా ఆలయం విద్యుద్దీపాల కాంతిలో మెరిసిపోతోంది. విద్యుత్ కాంతుల్లో ఏర్పాటు చేసిన దేవతల కటౌట్లు అందరినీ ఆకట్టుకుంటున్నాయి. ఆలయంలోని రంగమండపాన్ని వివిధ రకాల పూలతో ప్రత్యేకంగా అలంకరించారు.

నేడు ధ్వజారోహణం

కోదండరామాలయ బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం ఉదయం ఉదయం 10.30 గంటల నుంచి 11 గంటల మధ్య మిధున లగ్నంలో ధ్వజారోహణం నిర్వహించనున్నారు. సాయంత్రం 4గంటల నుంచి 7 గంటల వరకు పోతన జయంతి, కవి సమ్మేళనం, రాత్రి 7 నుంచి 9 గంటల వరకు శేషవాహనంపై స్వామివారి గ్రామోత్సవం నిర్వహించనున్నారు. కార్యక్రమంలో డిప్యూటీ ఈవోలు నటేష్‌బాబు, ప్రశాంతి, సూపరింటెండెంట్ హనుమంతయ్య, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ నవీన్ పాల్గొన్నారు.






పుట్ట నుంచి మన్ను సేకరిస్తున్న అర్చకులు



పుట్ట మన్ను తీసుకువస్తున్న అర్చకులు



ప్రత్యేక అలంకరణలో రంగమండపం



కేరళ కళాకారుల ప్రదర్శన

జగన్ హామీలన్నీ గాల్లోనే..

● 10 శాతం కూడా హంద్రీ-నీవా పనులు చేయలేదు
● చేనేత ఉత్పత్తులకు బ్రాండ్ ఇమేజ్ ఏమైంది
● టమోటా కోల్డ్ స్టోరేజ్‌లు ఎక్కడన్నా..
● రబ్బరు స్టాంపులా పీలేరు ఎమ్మెల్యే చింతల
● పీలేరును తమ రాజ్యంలా మార్చుకున్న పెద్దిరెడ్డి కుటుంబం
● న్యాయ్‌యాత్రలో ఏపీసీసీ అధ్యక్షురాలు షర్మిల

మదనపల్లె అర్బన్/ పీలేరు, ఏప్రిల్ 16: మదనపల్లె ప్రజలకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలన్నీ గాల్లో కొట్టుకుపోయాయని ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల తెలిపారు. న్యాయ్ యాత్రలో భాగంగా మంగళవారం సాయంత్రం మదనపల్లెకు విచ్చేశారు. ఈ సందర్భంగా స్థానిక బెంగళూరు బస్టాండులోని బహిరంగ సమావేశంలో షర్మిల మాట్లాడుతూ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు జగన్ చేపట్టిన పాదయాత్రలో, ఎన్నికల సందర్భంగా ఇక్కడి ప్రజలకు ఇచ్చిన హామీలలో ఒక్కటి కూడా నెరవేర్చలేదని ధ్వజమెత్తారు. జగన్ ఇచ్చిన హామీలన్నీ గాల్లో కొట్టుకుపోయాయంటూ విమర్శించారు. హంద్రీ-నీవాను వైఎస్ రాజశేఖర్‌రెడ్డి బతికున్నప్పుడు 90 శాతం పూర్తి చేయగా, మిగిలిన పదిశాతాన్ని ఆ తర్వాత వచ్చిన చంద్రబాబు, ప్రస్తుత వైసీపీ ప్రభుత్వం పూర్తి చేయలేకపోయారని ఎద్దేవా చేశారు. మదనపల్లె నీరుగట్టువారిపల్లెలో చేనేతలు ఎక్కువగా ఉన్నారని, వీరి చేనేత ఉత్పత్తులకు గిట్టుబాటు ధరతో పాటు ఇక్కడ తయారయ్యే చీరలకు కల్పిస్తానన్న బ్రాండ్ ఇమేజ్ ఏమైందని జగన్‌ను ప్రశ్నించారు. మదనపల్లె చుట్టూ ఏర్పాటు చేస్తానన్న ఔటర్ రింగురోడ్డు ఏమైందని, అది కూడా ఫ్యాన్ గాలికి కొట్టుకుపోయిందా? అంటూ నిలదీశారు. పడమటి మండలాల్లో ఎక్కువగా పండించే టమోటా రైతును ఆదుకునేందుకు టమోటాకు గిట్టుబాటు ధర కల్పిస్తామని, ధరలు హెచ్చు తగ్గులు ఉన్నప్పుడు టమోటాను నిల్వ చేసి ధరలు వచ్చాక అమ్ముకునేందుకు వీలుగా కోల్డ్‌స్టోరేజీలు నిర్మిస్తామని, టమోటా ఆధారిత పరిశ్రమలు ఏర్పాటు చేస్తామన్న జగన్ వీటిలో ఒకటైనా నెరవేర్చారా? అంటూ ప్రశ్నించారు. మదనపల్లె తాగునీటి సమస్య శాశ్వత పరిష్కారానికి ఉద్దేశించిన సమ్మర్‌స్టోరేజీ ట్యాంకులు, వాటి మొరవలు కూడా పూర్తిచేయలేదన్నారు. మదనపల్లె కాంగ్రెస్ అభ్యర్థి మల్లెల పవన్‌కుమార్‌రెడ్డి, నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ఎస్.రెడ్డిసాహెబ్, సీపీఎం నాయకుడు పి.శ్రీనివాసులు, ఆమ్‌ఆద్మీపార్టీ నాయకుడు రహీమ్ మాట్లాడారు. షర్మిల సాయంత్రం 6:45 గంటలకు చేరుకుని 7:30 గంటల వరకూ ప్రసంగించారు. ఆమె మాట్లాడుతున్నంత సేపు భారీగా చేరుకున్న ప్రజలు ఆమెకు జేజేలు పలికారు. ఇక్కడి సమావేశం అనంతరం రోడ్‌షోగా బి.కొత్తకోటకు వెళ్లారు. కార్యక్రమంలో పార్టీ మైనార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు డాక్టర్ ఎస్కే బాషా, సీపీఐ నాయకులు కృష్ణప్ప, మురళి, నియోజకవర్గంలోని మూడు మండలాల నుంచి పెద్ద సంఖ్యలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు, పార్టీ అభిమానులు పాల్గొన్నారు.

రబ్బరుస్టాంపులా చింతల

● పెత్తనమంతా పెద్దిరెడ్డి కుటుంబానిదే

మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఆయన తనయుడు ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డిలు పీలేరును తమ రాజ్యంగా మలుచుకుని పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డిని రబ్బరు స్టాంపుగా మార్చి వేశారని వైఎస్ షర్మిల ఆరోపించారు. న్యాయ్‌యాత్రలో భాగంగా మంగళవారం సాయంత్రం ఆమె పీలేరుకు వచ్చారు. ఈ సందర్భంగా స్థానిక ఆర్టీసీ బస్టాండు కూడలిలో ఏర్పాటు చేసిన సభలో ప్రసంగించారు. మంత్రి, ఎంపీలు చేసే అవినీతి పనులకు ఎమ్మెల్యే చింతల గంగిరెద్దులా తలూపాల్సిందేనని, లేకపోతే వారు చింతలను బతకనివ్వరని ఆరోపించారు. వైసీపీ హయాంలో పీలేరు నియోజకవర్గ అభివృద్ధి పూర్తిగా కుంటుపడిందన్నారు. గత ఎన్నికల సందర్భంగా వారు హామీ ఇచ్చిన విధంగా టమోటా రైతులకు ఎటువంటి సాయం అందించలేదన్నారు. టమోటా పల్ప్ పరిశ్రమ, ప్రాసెసింగ్ యూనిట్, కోల్డ్ స్టోరేజ్ వంటి హామీలను నెరవేర్చలేదన్నారు.



పీలేరులో జరిగిన సభలో మాట్లాడుతున్న వైఎస్ షర్మిల

హత్యా రాజకీయాలను ప్రోత్సహిస్తున్న జగన్

సొంత బాబాయిని హత్య చేసిన వైఎస్ అవినాశ్‌రెడ్డికి మళ్లీ కడప ఎంపీ టిక్కెట్టు ఇచ్చి హత్యా రాజకీయాలు, హంతకులను జగన్ ప్రోత్సహిస్తున్నారని ఆరోపించారు. జగన్ కారణంగా రాష్ట్రంలో ల్యాండ్, శ్యాండ్, మైన్స్, వైన్ మాఫియా నడుస్తోందని, రాజకీయాలను ఆ నాలుగు మాఫియాలు శాసించే దుస్థితి వచ్చిందన్నారు. కాంగ్రెస్ పార్టీతోనే ఆంధ్రప్రదేశ్ సంపూర్ణ అభివృద్ధి సాధ్యమవుతుందని షర్మిల పేర్కొన్నారు. పీలేరు అసెంబ్లీ అభ్యర్థిగా కాంగ్రెస్ పార్టీ తరపున పోటీ చేస్తున్న బాలినేని సోమశేఖర రెడ్డిని గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. రాజంపేట ఎంపీ అభ్యర్థిని కూడా త్వరలోనే ప్రకటిస్తామని, ఆయనను కూడా ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు అల్లాబకష్, నజీర్ అహ్మద్, అమృతతేజ, దుబ్బా శ్రీకాంత్, సంపత్, శ్రీవర్ధన్ చౌదరి, ఫయాజ్, రహంతుల్లా, యూసుఫ్ అలీ, ఇమ్రాన్ బాషా, తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల్లో టెన్షన్..టెన్షన్

వైఎస్ షర్మిల పర్యటన సందర్భంగా పీలేరు పోలీసుల్లో టెన్షన్ నెలకొంది. ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా షర్మిల సభ జరిగిన బస్టాండు ఎదుట ఉన్న వేర్‌హౌస్ గోడౌన్ షాపింగ్ కాంప్లెక్స్‌ను పోలీసులు తమ అధీనంలోకి తీసుకుని గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. రాయచోటి డీఎస్పీ మహబూబ్‌బాషా నేతృత్వంలో పీలేరు అర్బన్ సీఐ మోహన్‌రెడ్డి పర్యవేక్షణలో పీలేరు, కలకడ, వాల్మీకిపురం సర్కిళ్ల పరిధిలోని ఎస్‌ఐలు, సిబ్బంది బందోబస్తులో పాల్గొన్నారు.



మదనపల్లెలో జరిగిన న్యాయ్ యాత్రలో ఏపీసీసీ అధ్యక్షురాలు షర్మిల

నందలూరు వాసి సివిల్స్‌లో మెరిశాడు

● గొబ్బిళ్ల కృష్ణ శ్రీవాస్తవ్‌కు 444వ ర్యాంకు



గొబ్బిళ్ల కృష్ణ శ్రీవాస్తవ్

నందలూరు, ఏప్రిల్ 16: యూపీఎస్సీ విడుదల చేసిన సివిల్స్ ఫలితాల్లో గొబ్బిళ్ల కృష్ణ శ్రీవాస్తవ్ 444వ ర్యాంకు సాధించి నందలూరు కీర్తి ప్రతిష్ఠలు పెంపొందించాడు. నందలూరులోని గొబ్బిళ్ల శంకరయ్య పాఠశాలలో 10వ తరగతి పూర్తి చేశాడు. గుంటూరు ఎన్ఆర్ఐ కళాశాలలో ఇంటర్మీడియట్, అనంతపూర్‌లోని జేఎన్టీయూ బీటెక్ మెకానికల్ బ్రాంచ్‌ను పూర్తి చేశాడు. చెన్నైలోని శంకర్ ఐఏఎస్ అకాడమీలో సివిల్స్‌లో శిక్షణ పొందాడు. 2023వ సంవత్సరంలో విడుదల చేసిన గ్రూప్-1 ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి డిస్ట్రిక్ రిజిస్ట్రార్‌గా ఎంపికై ప్రస్తుతం తాడేపల్లిగూడెంలో విధులు నిర్వహిస్తున్నాడు. అక్క గొబ్బిళ్ల విద్యాధరి నెల్లూరు జిల్లాలోని కందుకూరులో సబ్‌కలెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. బావ కొఠారి సోమశేఖర్ అప్పారావు పుదుచ్చేరిలో సబ్ కలెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. తల్లి సుజాతమ్మ, అక్క విద్యాధరి ప్రోత్సాహంతోనే సివిల్స్‌లో తాను ర్యాంకు సాధించానని ఈ సందర్భంగా కృష్ణ శ్రీవాస్తవ్ తెలిపారు.

తాగునీటి సమస్యపై యుద్ధ ప్రాతిపదికన చర్యలు

● ఉపాధి హామీ పథకం ద్వారా పనులు కల్పించాలి ● కలెక్టర్ అభిషిక్త్ కిశోర్



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ అభిషిక్త్ కిశోర్

రాయచోటి (కలెక్టరేట్), ఏప్రిల్ 16: వేసవిలో తాగునీటి ఎద్దడి నివారణకు యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టాలని కలెక్టర్ అభిషిక్త్ కిశోర్ అధికారులను ఆదేశించారు. మంగళవారం విజయవాడ నుంచి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ జవహర్‌రెడ్డి సమీక్ష నిర్వహించారు. కలెక్టరేట్‌లోని మినీ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్‌తో పాటు జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, డ్వామా పీడీ మద్దిలేటి, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఈ సురేశ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం కలెక్టర్ అధికారులతో మాట్లాడుతూ జిల్లాలో నీటి సమస్య తలెత్తకుండా అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. ప్రస్తుతం 80 హ్యాబిటేషన్స్‌లో ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేస్తున్నామని, మే, జూన్ మాసాలలో కూడా నీటి సరఫరా చేసేందుకు వెంటనే ప్రపోజల్స్ పంపాలని ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా రామాపురం, గాలివీడు, రాయచోటి, లక్కిరెడ్డిపల్లె, సంబేపల్లె, చిన్నమండెం, సుండుపల్లె, బి.కొత్తకోట, తంబళ్లపల్లె మండలాల్లో తాగునీటి ఎద్దడిపై అధికారుల పర్యవేక్షణ ఉండాలన్నారు. గ్రామ పంచాయతీలు, హ్యాబిటేషన్లు, మున్సిపాలిటీ పరిధిలో తాగునీటికి ఇబ్బందులు తలెత్తకుండా ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు ప్రతిరోజు పర్యవేక్షణ చేయాలన్నారు. ఏప్రిల్, మే, జూన్, ఈ మూడు నెలలు క్షేత్రస్థాయిలో తాగునీటి సమస్య రాకుండా అధికారులు జాగ్రత్తగా ఉండాలన్నారు. జిల్లాలోని తాగునీటి పథకాలను పరిశీలించి పైపులైన్ల లీకేజీలు, బోర్ల మరమ్మతులు పూర్తి చేయాలన్నారు. జిల్లాలో ఎక్కడైనా నీటి సమస్య ఉన్నట్లయితే ఆర్‌డబ్ల్యుఎస్ అధికారి కార్యాలయంలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూం నెంబర్ 9032430230కి ఫోన్ చేసి నీటి సమస్య పరిష్కరించుకోవాలన్నారు. వేసవిలో విద్యుత్ సమస్య తలెత్తకుండా చూడాలని ఏపీఎస్పీడీసీఎల్ అధికారులను ఆదేశించారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా అర్హులైన పేదలందరికీ జాబ్‌కార్డులు మంజూరు చేసి పని కల్పించాలన్నారు. ఈ పథకం ద్వారా గ్రామీణ ప్రాంతంలోని ప్రజలకు మెరుగైన జీవనోపాధి కల్పించే విధంగా సంబంధిత అధికారులు కృషి చేయాలన్నారు. పనిచేసే ప్రాంతంలో కూలీలకు ప్రభుత్వ నియమ నిబంధనల ప్రకారం నీరు, షామియానా, ఫస్ట్ ఎయిడ్ కిట్స్ వంటి అన్ని వసతులు ఉండేటట్లు చూడాలన్నారు.

వైసీపీ సీనియర్ నాయకుడు పద్మనాభరెడ్డి, సింగిల్‌విండో ప్రెసిడెంట్ కల్లూరు రాంమోహన్‌రెడ్డిని పార్టీలోకి ఆహ్వానిస్తున్న సుగవాసి, చమర్తి



రాజంపేటలో ఇంటింటా ప్రచారం నిర్వహిస్తున్న సుగవాసి బాలసుబ్రమణ్యం



అరాచక పాలనను అంతమొందించడానికే వలసలు

● రాజంపేట ఎమ్మెల్యే అభ్యర్థి సుగవాసి బాలసుబ్రమణ్యం
● వైసీపీ నుంచి టీడీపీలో భారీగా చేరికలు

వీరబల్లి/రాజంపేట టౌన్, ఏప్రిల్ 16: వైసీపీ అరాచక పాలనను అంతమొందించడానికే వైసీపీ నుంచి టీడీపీలోకి నాయకులు, కార్యకర్తలు భారీగా వలసలు వస్తున్నారని టీడీపీ రాజంపేట ఎమ్మెల్యే అభ్యర్థి సుగవాసి బాలసుబ్రమణ్యం తెలిపారు. వీరబల్లి మండలం మట్లి, వంగిమళ్ల పంచాయతీల్లోని గ్రామాల్లో సుమారు 200 కుటుంబాల వారు సుగవాసి బాలసుబ్రమణ్యం, రాజంపేట టీడీపీ పార్లమెంట్ అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజు ఆధ్వర్యంలో మంగళవారం వైసీపీ నుంచి టీడీపీలోకి చేరారు. వారిలో టెంకాయచెట్లపల్లికి చెందిన వైసీపీ సీనియర్ నాయకుడు కొత్త పద్మనాభరెడ్డి, వీరబల్లి సింగిల్‌విండో అధ్యక్షుడు కల్లూరి రాంమోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో వంగిమళ్ల కస్పా, పెద్దహరిజనవాడ, నాగిరెడ్డిగారిపల్లె, వంగకాడపల్లె హరిజనవాడ, అమూరివాండ్లపల్లె గ్రామాలకు చెందిన వారు అధికంగా వైసీపీ నుంచి టీడీపీలో చేరారు. మట్లి గ్రామంలో యల్లంపల్లి, బోడిమల్‌రెడ్డిగారిపల్లె గ్రామాల్లో సర్పంచ్ సోమారపు నాగార్జునాచారి ఆధ్వర్యంలో టీడీపీలో చేరారు. వీరబల్లి పంచాయతీ బాలసానివారిపల్లె, బాలగ్గారిపల్లె, పుత్తావాండ్లపల్లె గ్రామాల్లో వైసీపీ నాయకులతో చర్చలు జరిపారు. త్వరలో వారు టీడీపీలో చేరతారని ఈ సందర్భంగా నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా బాలసుబ్రమణ్యం మాట్లాడుతూ వైసీపీ పాలనలో నాయకులు దోచుకోవడం తప్ప అభివృద్ధి చేసిన సందర్భాలు ఎక్కడా లేవన్నారు. రాష్ట్రం బాగుపడాలంటే చంద్రబాబునాయుడు సీఎం తప్పకుండా కావాలన్నారు. వీరబల్లి మండలంలో రోడ్లు కూడా సక్రమంగా లేవన్నారు. తాగునీటి సమస్య ఎక్కడా చూసినా కనిపిస్తుందన్నారు. సాగునీటి వసతి లేక రైతులు ఆత్మహత్యలు చేసుకునే పరిస్థితి నెలకొందన్నారు. తనను ఆదరించి ఎమ్మెల్యేగా గెలిపిస్తే అందుబాటులో ఉంటూ వీరబల్లి మండలానికి శాశ్వత సాగు, తాగునీటి పరిష్కారానికి అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల శాఖ అధ్యక్షుడు భానుగోపాల్ రాజు, నాయకులు వై.రెడ్డెప్పరెడ్డి, సురేంద్రారెడ్డి, రాయచోటి నాయకుడు మదన్‌మోహన్‌రెడ్డి, సుండుపల్లె నాయకులు శివారెడ్డి, శ్రీధర్‌రెడ్డి, దుర్గం ఆంజనేయులు, ఆంజనేయులు రెడ్డి, టీడీపీ మహిళా అధ్యక్షురాలు నాగసుబ్బమ్మ, తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ అరాచక పాలన నచ్చకనే టీడీపీలో చేరాం

వైసీపీ అరాచక పాలన నచ్చకనే తెలుగుదేశం పార్టీలోకి చేరినట్లు వీరబల్లి సింగిల్‌విండో అధ్యక్షుడు కల్లూరి రాంమోహన్‌రెడ్డి తెలిపారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి కేవలం బటన్ నొక్కడం తప్ప అభివృద్ధి, సంక్షేమం పట్ల చర్యలు తీసుకున్న దాఖలాలు లేవన్నారు. తనతో పాటు వైసీపీ నాయకులు, కార్యకర్తలు టీడీపీలో చేరారన్నారు. బాలసుబ్రమణ్యం గెలుపుకోసి తమ శాయశక్తులా కృషి చేస్తామని చెప్పారు. కాగా వీరి చేరికతో వీరబల్లిలో వైసీపీకి కోలుకోలేని దెబ్బ తగిలింది.

విస్తృత ప్రచారం

రాజంపేట నియోజకవర్గంలో మంగళవారం సుగవాసి బాలసుబ్రమణ్యం వీరబల్లి, రాజంపేట పట్టణంలో విస్తృతంగా ప్రచారం చేశారు. టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి చెన్నూరు సుధాకర్ ఆధ్వర్యంలో రాజంపేట పట్టణంలోని పాతపోలీసులైను వీధి, ఆకుల వీధి, కొలిమి వీధి ప్రాంతాల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. సూపర్ సిక్స్ పథకాలపై వివరిస్తూ సైకిల్‌కు ఓటు వేయాలని అభ్యర్థించారు.

కడప జిల్లాలో ప్రభుత్వ భూములు అన్యాక్రాంతం

● లోకాయుక్త ఆదేశాలతో కదిలిన రెవెన్యూ యంత్రాంగం

కర్నూలు(లీగల్), ఏప్రిల్ 16: కడప జిల్లాలోని రెండు మండలాల్లో ఒక రాజకీయ నాయకుడు ప్రభుత్వ భూములను ఆక్రమించుకున్నాడంటూ వచ్చిన ఫిర్యాదుపై రాష్ట్ర లోకాయుక్త స్పందించింది. లోకాయుక్త ఇచ్చిన ఆదేశాలతో జిల్లా రెవెన్యూ యంత్రాంగం దిగి వచ్చి సదరు ఆక్రమణలను అరికట్టింది. కడప జిల్లాలోని పోరుమామిళ్ల మండలంలోని శ్రీ అవధూత కాశిరెడ్డినాయన మండలాల్లో పోతిరెడ్డి నాగార్జున రెడ్డి అనే రాజకీయ నాయకుడు, అతడి కుటుంబీకులు ప్రభుత్వ భూములను ఆక్రమించుకుని వాటిని రిజిస్ట్రేషన్ కూడా చేయించుకున్నాడనీ దళిత్ కమిటి పీపుల్ అనే సంస్థ రాష్ట్ర లోకాయుక్తకు ఫిర్యాదు చేసింది. ఈ ఫిర్యాదుపై విచారించి వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర లోకాయుక్త కడప జిల్లా కలెక్టర్‌కు గతంలో ఆదేశించింది. ఈ మేరకు కదిలిన రెవెన్యూ యంత్రాంగం సదురు అక్రమ రిజిస్ట్రేషన్లను రద్దు చేసి ఆక్రమణలను అరికట్టినట్లు రాష్ట్ర లోకాయుక్తకు తమ నివేదికలో తెలియజేశారు. దీంతో సంబంధిత రెవెన్యూ అధికారులపై చర్యలు తీసుకోవాలని రాష్ట్ర లోకాయుక్త మంగళవారం ఆదేశాలు జారీ చేసింది.

టీడీపీ ప్రచారంలో వలంటీర్ వైసీపీ నినాదాలు

ప్రొద్దుటూరు ,ఏప్రిల్ 16 : టీడీపీ ఎన్నికల ప్రచారంలో భాగంగా నంద్యాల వరదరాజులరెడ్డి తాళ్ళమాపురం పంచాయతీ మూలవారిపల్లె లో సోమవారం ప్రచారం చేశారు. ఈ సందర్భంగా మూలవారిపల్లెకు చెందిన మార్కు అనే వలంటీర్ వైసీపీ అనుకూల నినాదాలు ఇచ్చారు. దీనిపై టీడీపీ నేతలు ఎన్నికల రిటర్నింగ్ అధికారికి ఫిర్యాదు చేశారు ఈ సంఘటనపై విచారణ చేసి మార్కును విధుల నుంచి తొలగించడంతోపాటు అతనిపై కేసునమోదు చేసినటు రూరల్ ఎంసీసీ అధికారి ఇన్‌చార్జ్ ఎంపీడీవో రామాంజనేయరెడ్డి తెలిపారు.

విద్యార్థిని మృతిపై విచారణ చేయాలి



కళాశాల ఎదుట యాజమాన్యంతో వాగ్వాదం చేస్తున్న విద్యార్థి సంఘాల నేతలు

రాజంపేటటౌన్, ఏప్రిల్ 16: బీటెక్ విద్యార్థిని రేణుక మృతిపై వెంటనే విచారణ చేసి న్యాయం చేయాలని కోరుతూ మంగళవారం టీఎన్ఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ, ఏబీవీపీ, పీడీఎస్‌యూ, జీఆర్ఎస్ఎఫ్ఐ సంఘాలు కళాశాల వద్ద ఆందోళన చేశాయి. ఈ సందర్భంగా టీఎన్ఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు పోలి శివకుమార్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి నరసింహ, పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు నాగేశ్వర మాట్లాడుతూ ఈ కళాశాలలో ఏడాది వ్యవధిలో ఇద్దరు విద్యార్థినులు ఆత్మహత్యలు చేసుకున్నారన్నారు. విద్యాలయంలో ఏ జరుగుతుందో నిజానిజాలు వెలుగులోకి రావాలంటే రిటైర్డ్ జడ్జితో విచారణ చేయించాలన్నారు. విద్యార్థుల మరణాలకు కారణాలేమిటో వెలికి తీయాలన్నారు. విద్యార్థిని చనిపోయే ముందు సూసైడ్ నోట్ రాసిందని పుకార్లు వస్తున్నాయని, వెనువెంటనే ఆ సూసైడ్ నోట్‌ను వెల్లడించాలని డిమాండ్ చేశారు.

జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక



పల్లవి

సంబేపల్లె, ఏప్రిల్ 16: జాతీయ స్థాయి మోడ్రన్ పెంటాథ్లాన్ పోటీలకు సంబేపల్లె మోడల్ స్కూల్ క్రీడాకారిణి ఎం.పల్లవి ఎంపికైనట్లు మంగళవారం ప్రిన్సిపాల్ దిలీప్‌కుమార్ తెలిపారు. మార్చి 30న తిరుపతిలో శ్రీనివాస స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో ఈ పోటీలు నిర్వహించారు. అండర్ -19 విభాగంలో విశేష ప్రతిభ కనపర్చడంతో జాతీయ స్థాయికి ఎంపికైనట్లు తెలిపారు. ఏప్రిల్ 28 నుంచి 30వ తేదీ వరకు మహారాష్ట్రలోని అమరావతిలో 67వ జాతీయ పాఠశాల పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఫిజికల్ డైరెక్టర్ షామీర్‌బాషాను పల్లవిని ఉపాధ్యాయులు ప్రిన్సిపాల్ అభినందించారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

సీఏల సంస్థ కార్యవర్గ సభ్యుడిగా శ్రీనివాసులురెడ్డి



కడప (ఎడ్యుకేషన్), ఏప్రిల్ 16 : అఖిల భారత చార్టర్డ్ అకౌంటెంట్స్ సంస్థ దక్షిణ భారత విభాగం దివాలా,వాల్యుయేషన్ స్టాండర్డ్స్ కమిటీ కార్యవర్గ సభ్యుడిగా ప్రముఖ ప్రాక్టీసింగ్ చార్టర్డ్ అకౌంటెంట్ మల్లం శ్రీనివాసులరెడ్డి ఎంపికయ్యారు. ఈయన కడప జిల్లా పెండ్లిమర్రి మండలం, మొయిళ్ల కాల్వ గ్రామ వాస్తవ్యుడు మల్లం పుల్లారెడ్డి, మల్లం వెంకటలక్షుమ్మ కుమారుడు. ఆయన విద్యాభ్యాసం కడపలో, హైదరాబాదులోని ఉస్మానియా విశ్వవిద్యాలయంలో సాగింది. ఇప్పుడు కడపలో వైవీయూలో పీహెచ్‌డీచేస్తున్నారు. ఎన్ని కష్టాలు ఎదురైనా మొక్కవోని పట్టుదలతో క్రమశిక్షణతో సీఏ పట్టా సాధించిన ఆయన ఇప్పుడు ప్రతిష్టాత్మకమైన కమిటీలో స్థానం సాధించారు. ఈ అర్హత సాధించిన శ్రీనివాసులరెడ్డిని మిత్రులు, బంధువులు మరియు ప్రముఖులు అభినందించారు.

యువకుడిపై కత్తులతో దాడి

పోలీసు అదుపులో నిందితులు

కడపక్రైం ఏప్రిల్16: కడప నగరం రాజారెడ్డి వీధికి చెందిన యువకుడిపై సోమవారం అర్ధరాత్రి ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో కొందరు కత్తులతో దాడి చేశారు. రాజారెడ్డివీధికి చెందిన సుజిత్, అభినయ్ అన్నదమ్ములు. వారికి మృత్యుంజయకుంటకు చెందిన యువకుడితో మనస్పర్థలు ఉన్నాయి. సోమవారం రాత్రి మృత్యుంజయకుంటకు చెందిన యువకుడు అదే ప్రాంతానికి చెందిన ఓ రౌడీషీటర్, మరి కొందరితో కలిసి సుజిత్ బైకుకు నిప్పంటించి పారిపోయారు. దీంతో సుజిత్ తన సోదరుడు అభినయ్‌తో కలిసి పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు వెళుతుండగా రౌడీషీటర్ ఫోన్ చేసి ఆర్టీసీ బస్టాండ్ వద్దకు పిలింపించాడు. అభినయ్ అక్కడికి వెళ్లగానే కత్తులతో దాడి చేశారు. అదే ప్రాంతాంలో విధులు నిర్వహిస్తున్న ఎస్సై మధుసూదన్ రెడ్డి అక్కడికి చేరుకుని ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. మిగిలిన వారు పరారయ్యారు. గాయపడ్డ యువకుడిని రిమ్స్‌కు తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు నిందితులపె కేసు నమోదు చేసినట్లు వన్‌టౌన్ పోలీసులు తెలిపారు.

నామినేషన్ల ప్రక్రియను విజయవంతం చేయాలి

● కలెక్టర్, జిల్లా ఎన్నిక అధికారి అభిషిక్త్‌కిశోర్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ అభిషిక్త్‌కిశోర్

రాయచోటి(కలెక్టరేట్), ఏప్రిల్ 16: జిల్లాలో ఈ నెల 18 నుంచి మొదలయ్యే నామినేషన్స్ ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేయాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి అభిషిక్త్‌కిశోర్ అధికారులను ఆదేశించారు. మంగళవారం విజయవాడలోని రాష్ట్ర సచివాలయం నుంచి రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేశ్‌కుమార్‌మీనా వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి అన్ని జిల్లాల కలెక్టర్లతో మాట్లాడారు. నామినేషన్ ప్రారంభం నుంచి రాబోయే రోజుల్లో వివిధ అంశాల్లో తీసుకోవాల్సిన చర్యలు, నిర్వర్తించాల్సిన విధులపై సమావేశం నిర్వహించి దిశా నిర్దేశం చేశారు. అనంతరం కలెక్టర్, స్థానిక అధికారులతో మాట్లాడుతూ సీ విజిల్ ఈఎస్ఎంఎస్ డిస్ట్రిక్ గ్రీవెన్స్ కమిటీ ద్వారా సీజర్స్, రిజీజెస్ అంశాల్లో ప్రగతిపై ఎప్పటికప్పుడు ఎన్నికల సంఘానికి నివేదిక సమర్పించాలన్నారు. నామినేషన్స్ ప్రక్రియను పటిష్టంగా నిర్వహించాలని, అందుకు సంబంధించి ఎప్పటికప్పుడు నిర్దేశిత నమూనాలో నివేదికలను సమర్పించాలన్నారు. పోస్టల్ బ్యాలెట్, హోమ్ ఓటింగ్, జిల్లా ఫ్లయింగ్ స్క్వాడ్‌లపై రోజువారి నివేది సమర్పించాలన్నారు. పోస్టల్ బ్యాలెట్ ఫెసిలిటేషన్ సెంటర్‌లో అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని, ఎస్ఎస్టీ, ఎఫ్ఎస్టీ టీమ్స్, మైక్రో అబ్జర్వర్ల నియామకం, వెబ్‌కాస్టింగ్ ఏర్పాట్లు, ఎఫ్ఎస్టీ, ఎస్ఎస్టీ టీమ్స్ రిజిస్టర్ మెయింటెనెన్స్ తదితర అంశాల్లో తీసుకోవాల్సిన చర్యలపై అధికారులకు సూచనలు జారీ చేశారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, డీఆర్వో సత్యనారాయణరావు, వివిధ విభాగాల నోడల్ అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

నామినేషన్ల ప్రక్రియ ప్రశాంతంగా జరగాలి

ప్రొద్దుటూరు: ప్రొద్దుటూరు అసెంబ్లీ ఎన్నికలకు సంబంధించిన నామినేషన్ల ప్రక్రియ ఏప్రిల్ 18 నుంచి ప్రారంభం అవుతుందని ఎలాంటి ఆర్భాటాలు హంగులు ప్రదర్శించకుండా అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేయాలని ఎన్నికల రిటర్నింగ్ అధికారి కౌసర్‌బాను తెలిపారు. మంగళవారం తహసీల్దారు కార్యాలయంలో రాజకీయ పార్టీ ప్రతినిధులతో ఆమె సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 18 నుంచి నామినేషన్ల ప్రక్రియ ప్రారంభం అయ్యి 25న ముగుస్తుందన్నారు. 26న నామినేషన్ల స్క్రూటినీ ఉంటుందన్నారు. 29 న ఉపసంహరణ. అదే రోజు గుర్తుల కేటాయింపు జరుగుతుందన్నారు. మే 13న పోలింగ్ జరుగుతుందన్నారు. నామినేషన్లుకు ఏమేం జతచేయాలో పార్టీ ప్రతినిధులకు వివరించారు. అందుకు సంబంధించిన బుక్‌లెట్‌లను అందజేశారు. కార్యక్రమంలో తహసీల్దారు విద్యాసాగర్, మున్సిపల్ కమిషనర్ రఘునాథరెడ్డి, ఎంపీడీవో రామాంజనేయరెడ్డి, రాజుపాళెం ఎంపీడీవో వెంకటరెడ్డి, ఎన్నికల డిప్యూటీ తహసీల్దారు అజయ్‌బాబు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలపై అలసత్వం వహిస్తే చర్యలు : ఎస్ఈ



విద్యుత్ సిబ్బందికి సూచనలు ఇస్తున్న ఎస్ఈ రమణ

పోరుమామిళ్ల, ఏప్రిల్ 16 : నిర్దేశిత పోలింగ్‌బూత్‌ల వద్ద ట్రాన్స్‌ఫార్మర్లు, లైన్లకు మరమ్మతులు చేసి అంతరాయం లేకుండా నిరంతరం విద్యుత్ అందించడంపై ప్రత్యేక దృష్టి సారించాలని విద్యుత్‌శాఖ సూపరింటెండెంట్ ఇంజనీరు రమణ అన్నారు. మంగళవారం ఆయన పోరుమామిళ్లలోని 33/11 కేవీ సబ్‌స్టేషన్ ట్రాన్స్‌ఫార్మర్లు, లైన్లు క్షేత్రస్థాయిలో ఆయనే స్వయంగా తిరిగి పరిశీలించి సిబ్బందికి సూచనలు ఇచ్చారు. పోరుమామిళ్ల సబ్ డివిజను పరిధిలోని పోరుమామిళ్ల, కలసపాడు, కాశినాయన, బి.కోడూరు మండలాల క్షేత్ర స్థాయి అధికారులు సిబ్బందితో పోరుమామిళలోని సీసీఆర్ కాంప్లెక్స్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నీటి ఎద్దడి కారణంగా నీటి పథకాల కొత్త పనులు, మరమ్మతులను అత్యధిక ప్రాధాన్యతతో యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని ఆదేశించారు. అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. కరెంటు పోయి ప్రజలు భరించలేని స్థితిలో ఉన్నప్పుడు విద్యుత్ సమస్యలపై వెంటనే స్పందించాలన్నారు. వేసవిలో విద్యుత్ వినియోగం అధికంగా ఉంటుందని, లో ఓల్టేజీ సమస్య అధిగమించేందుకు కొత్త ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయాలన్నారు. ప్రతి ఉద్యోగి జవాబుదారీతనంతో పనిచేయాలన్నారు. వినియోగదారులకు విద్యుత్ అంతరాయం లేకుండా చేయాలనే తలంపుతో సిబ్బంది పనిచేయాలన్నారు. ట్రాన్స్‌ఫార్మర్లు, లైన్లను ఉద్యోగులు తన సొంత ఆస్తిగా భావించాలన్నారు. మీటర్లను ఇంటిలోపల కాకుండా బయట బిగించాలన్నారు. వీధిలైట్లు పగటిపూట వెలుగుతున్నాయని, సంబంధిత సిబ్బందిపై చర్యలు తప్పవన్నారు. ఒక్క యూనిట్ కూడా విద్యుత్ వృథా కాకూడదన్నారు. విద్యుత్ బకాయిల వసూళ్లలో రాజీ పడవద్దని విద్యుత్ బకాయిల వసూళ్లపై దృష్టి సారించాలన్నారు. విద్యుత్ చౌర్యం అరికట్టాలని, వాలిపోయిన స్తంభాలు, వేలాడుతున్న తీగెలను సరిచేయాలన్నారు. విద్యుత్ పనులు చేసేటప్పుడు భద్రతా నియమాలు పాటించాలన్నారు. వ్యవసాయ ఆధారిత ప్రాంతాల్లో రైతులు తామే ట్రాన్స్‌ఫార్మర్ల ఫీజులు మార్చడం వటి పనులపై స్పందించాలన్నారు. విద్యుత్ వినియోగదారుడికి సమస్యలు వచ్చినప్పుడు సిబ్బంది వెంటనే పరిష్కరించాలన్నరు. కడప సీనియర్ అకౌంట్స్ ఆఫీసరు మధు, అకౌంటు ఆఫీసరు మల్లికార్జున, మైదుకూరు ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు శ్రీనివాసులరెడ్డి, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు నాయక్, ఏఏవో శివకుమార్, పోరుమామిళ్ల ఏఈ వెంకట మహేశ్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థిని మృతిపై వైవీయూ తీవ్ర దిగ్భ్రాంతి



విద్యార్థులకు ధైర్యం చెబుతున్న వైవీయూ ప్రిన్సిపాల్ రఘునాథరెడ్డి, రిజిస్ట్రార్ వెంకటసుబ్బయ్య

కడప (ఎడ్యుకేషన్), ఏప్రిల్ 16 : వైవీయూ బయోటెక్నాలజీ విద్యార్థిని సుల్తానా మృతి పట్ల తోటి విద్యార్థులు అధ్యాపకులు అధికారులు తీవ్ర దిగ్భ్రాంతిని, ఆవేదనను వ్యక్తం చేశారు. మంగళవారం మధ్యాహ్నం వరకు తరగతి గదిలో తోటి విద్యార్థులతో కలిసి పాఠాలు విన్న సుల్తానా అంతలోనే హాస్టలు వసతిగృహంలో బలన్మరణానికి పాల్పడిందని తెలియడం కలచివేసింది. విషయం తెలియగానే వైవీయూ ప్రిన్సిపాల్ రఘునాథరెడ్డి, రిజిస్ట్రారు ప్రొఫెసరు వైపీ వెంకటసుబ్బయ్య, సీఈ ప్రొఫెసరు ఈశ్వర్‌రెడ్డి, హెల్త్ సెంటరు వైద్యులు నరేష్‌కుమార్‌రెడ్డి విద్యార్థినిని రిమ్స్‌కు తరలించారు. ఆమె తల్లిదండ్రులకు సమాచారం అందించారు. హాస్టలులో తరగతి గదిలో అధ్యాపకులతో మాట్లాడారు. గత వారంలో పండుగ సెలవులు ఉండడంతో సుల్తానా తన సొంత ఊరు అయిన కదిరికి వెళ్లి సోమవారం యథావిధిగా తరగతులకు హాజరైనట్లు తోటి విద్యార్థులు తెలిపారు. తరగతిలో కూడా యాక్టివ్‌గా ఉన్నట్లు తెలిపారు. కాన్ఫరెన్స్ కోసం హైదరాబాదు వెళ్లిన వైస్‌చాన్సలర్ ప్రొఫెసరు చింతా సుధాకర్ విద్యార్థిని మృతిపై ఆరా తీశారు.

వీరశివారెడ్డి చంద్రబాబును విమర్శించడం విడ్డూరం

● టీడీపీ నేత హరిప్రసాద్



విలేకరులతో మాట్లాడుతున్న హరి ప్రసాద్

కడప (ఎడ్యుకేషన్), ఏప్రిల్ 16 : పూటకో పార్టీ మార్చే మాజీ ఎమ్మెల్యే వీరశివారెడ్డికి చంద్రబాబు, పుత్తా నరసింహారెడ్డి గురించి మాట్లాడే అర్హత లేదని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి హరిప్రసాద్, కమలాపురం నాయకులు గంధం మోహన్, టక్కోలి కృష్ణారెడ్డి విమర్శించారు. శనివారం కడప నగరం హరి టవర్స్‌లో వారు విలేకరులతో మాట్లాడుతూ చంద్రబాబు టికెట్లు అమ్ముకున్నాడని ఆరోపించిన వీరశివారెడ్డి, తాను టీడీపీలో ఉన్నప్పుడు ఎన్ని కోట్లు పెట్టి టికెట్లు కొన్నాడో చెప్పాలన్నారు. ఊసరవెల్లి రాజకీయాలు మానుకోవాలని హితవు పలికారు. రాజకీయాల్లో గెలుపోటములు సహజమని, పుత్తా నరసింహారెడ్డి గెలిచినా ఓడినా ఒకే పార్టీలో ఉన్నాడని, నీలా పార్టీ మారలేదని, నీచ రాజకీయాలు చేయలేదని అన్నారు. పార్టీలో ఉండి కూడా పార్టీ అభ్యర్థికి వ్యతిరేకంగా పనిచేసిన చరిత్ర వీరశివాదన్నారు. తనకు టికెట్ ఇస్తే మంచివాళ్లు, లేకపోతే అమ్ముకునేవాళ్లని అనడం ఆయన నీచ రాజకీయాలకు నిదర్శనమన్నారు. వీటిని నమ్మే పరిస్థితుల్లో కమలాపురం నియోజకవర్గ ప్రజలులేరన్నారు. కార్యక్రమంలో గన్నేపాటి మల్లేశ్, గంధం ప్రసాద్; కృష్ణారెడ్డి, గంధం మోహన్ పాల్గొన్నారు.

విద్యార్థుల సామర్థ్యాల అంచనాకే శ్లాష్ పరీక్ష : డీఈవో



కడప: పరీక్షలను పర్యవేక్షిస్తున్న డీఈవో అనూరాధ



రాజంపేట: పరీక్షలను తనిఖీ చేస్తున్న డీఈవో శివప్రకాష్ రెడ్డి

కడప (ఎర్రముక్కపల్లె), ఏప్రిల్ 16 : విద్యార్థుల సామర్థ్యాలను అంచనా వేసేందుకే శ్లాష్ పరీక్ష నిర్వహించామని డీఈవో ఎం.అనురాధ తెలిపారు. మంగళవారం జిల్లా వ్యాప్తంగా 121 ప్రభుత్వ, ప్రైవేటు యాజమాన్యాలలో నాలుగవ తరగతి విద్యార్థులకు చదవడం, రాయడంపై సామర్థ్యాలను అంచనా వేయడానికి స్లాష్ పరీక్ష నిర్వహించారు. ఈ పరీక్షలను ఆమె పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ సామర్థ్య పరీక్షలు నిర్వహించడానికి జిల్లా విద్యాశాఖలో సీఆర్పీల ద్వారా పరీక్షలు నిర్వహిస్తున్నామన్నారు. డీసీఈబీ సెక్రటరీ శంకరయ్య, సమగ్ర శిక్ష ఎఎంవో ధనలక్ష్మి, ఎంఈవో పాలెం నారాయణ, అహ్మద్ పాల్గొన్నారు.

రాజంపేట టౌన్: మండలంలోని దిగువబసినాయుడుగారిపల్లె ప్రాథమిక పాఠశాలలో స్లాస్ పరీక్షా కేంద్రాన్ని మంగళవారం డీఈవో శివప్రకాష్‌రెడ్డి తనిఖీ చేశారు. ఎంఈవో రఘునాథ రాజు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. మధ్యాహ్న భోజన పథకాన్ని జగనన్న గోరుముద్ద నాణ్యతను పరిశీలించారు.

ఇరు వర్గాల ఘర్షణ.. పలువురికి గాయాలు







గాయాలపాలై ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న యువకులు

పులివెందుల టౌన్, ఏప్రిల్ 16: పట్టణంలో క్షమాపణ కోసం అంబకపల్లె రోడ్డు జ్యోతి హాస్పిటల్ వద్ద ఇరు వర్గాలు ఘర్షణ పడ్డారు. ఈ సంఘటనలో పెద్దజూటూరుకు చెందిన వేణు, వంశి, పాండు కృష్ణారెడ్డి, జస్వంత్ పట్టణంలోని ఎరగుడిపాలెంకు చెందిన మల్లికార్జున, చందు, పండు, నాగిరెడ్డి, మరి కొంతమంది యువకులకు గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కడప రోడ్డులోని ఇండియన్ పెట్రోల్ బంకు వద్ద మంగళవారం వేణు తదితరులు నడుపుతున్న కారు ఎర్రగుడిపాలేనికి చెందిన మల్లికార్జున బైక్‌ను ఢీకొంది. అయితే, వారు కారు ఆపకుండా వెళ్లడంతో మల్లికార్జున కారును వెంబడించి అంబకపల్లె రోడ్డులోని జ్యోతి ఆసుపత్రి సమీపంలో అడ్డుకున్నాడు. కారులోని వారితో వాగ్వాదానికి దిగాడు. ఇరువురూ తమ మిత్రులకు ఫోన్ చేసుకోవడంతో అక్కడికి చేరుకుని కట్టెలు, రాళ్లతో దాడులు చేసుకున్నారు. సర్ది చెప్పేందుకు ప్రయత్నించిన వారిపై కూడా దాడికి యత్నించడంతో వారు పోలీసులకు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు ఇరు వర్గాల వారిని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. గాయాలైన వారిని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఇరువర్గాలపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

తాటిముంజెలకు భలే గిరాకీ..



పులివెందుల టౌన్, ఏప్రిల్ 16: వేసవి వచ్చిందంటే తాటిముంజెలకు గిరాకీ ఉంటుంది. ఔషధ గుణాలతో పాటు వేసవి తాపం నుంచి ఉపశమనం అందిస్తాయన్న ఉద్దేశంలో పలువురు వీటిని కొనుగోలు చేస్తారు. ఎర్రిపల్లె, అచ్చవెల్లి, గోటూరు తదితర గ్రామాల నుంచి రోజు తాటిముంజెలను తీసుకొచ్చి పట్టణంలోని పార్నపల్లె బస్టాండ్, పూలంగళ్ల సర్కిల్, కడప రోడ్డు ప్రాంతాలలో డజను రూ.100కు విక్రయిస్తున్నారు. దీంతో రోజుకు రూ.5వేల వరకు ఆదాయం వస్తుందని, మున్సిపాలిటీ పన్ను కూడా చెల్లిస్తున్నామని వ్యాపారులు చెబుతున్నారు. వేసవి కావడంతో వ్యాపారం బాగుందని చెబుతున్నారు.

నవ వధువు ఆత్మహత్య



ఝాన్సీ మృతదేహం

గాలివీడు, ఏప్రిల్ 16: మండలంలోని పూలుకుంట పంచాయతీ రెడ్డివారిపల్లెకు చెందిన నవవధువు ఝాన్సీ (19) ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్ఐ వెంకటప్రసాద్ తెలిపారు. గత 15 రోజుల క్రితం రెడ్డివారిపల్లెకు చెందిన వ్యక్తితో ఝాన్సీకి వివాహం కాగా, రెండు రోజులుగా కడుపు నొప్పితో బాధపడుతోందని, ఆ బాధ భరించలేక నిద్రమాత్రలు మింగి ఆత్మహత్య చేసుకుందని అమ్మాయి తల్లిదండ్రులు ఫిర్యాదు చేశారని తెలిపారు. మృతదేహాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం లక్కిరెడ్డిపల్లె ప్రభుత్వ వైద్యశాలకు తరలించినట్లు తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో ఒకరి మృతి

చెన్నూరు, ఏప్రిల్ 16 :మండలంలోని రుద్రభారతిపేటలో మంగళవారం గుర్తు తెలియని వ్యక్తి అనుమానాస్పద స్థితిలోమృతి చెందాడు. ఎయిర్‌పోర్టు సమీపంలోని ఇండియన్ పెట్రోలు బంకు పక్కన ఉన్న గాలిమిషన్ వద్ద 25 నుంచి 30 ఏళ్ల మధ్య వయసు ఉన్న యువకుడు మృతి చెందినట్లు స్థానిక పోలీసుస్టేషన్‌కు సమాచారం రావడంతో పోలీసు సిబ్బంది పరిశీలించారు. మృతుడి శరీరంపై ఎలాంటి గాయాలు లేకపోవడం గుర్తించారు. మృతదేహంపై నలుపు ఆకుపచ్చ రంగు చొక్కా, బ్లాక్ జీన్స్ ప్యాంటు ఉంది. మద్యం మత్తులో అక్కడ తూలుతూ తిరిగేవాడని, స్థానికులు పోలీసులకు వివరించారు. మృతదేహాన్ని రిమ్స్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

ఏనుగుల దాడిలో అరటి తోట ధ్వంసం



దెబ్బతిన్న పంటను పరిశీలిస్తున్న అధికారులు

రైల్వేకోడూరు(రూరల్), ఏప్రిల్ 16: మండలంలోని వీపీఆర్ కండ్రిక పంచాయతీలోని దేశెటిపల్లె బీటు పరిధిలో ఉన్న కమలానగర్ గ్రామానికి చెందిన రైతు కృష్ణకు చెందిన నాలుగు ఎకరాల అరటి తోటపై సోమవారం అర్ధరాత్రి ఏనుగుల మంద దాడి చేసింది. తోటలో ఉన్న మోటర్లను పైపులను ధ్వంసం చేశాయి. సమాచారం తెలుసుకున్న అటవీ శాఖ అధికారులు తోటను పరిశీలించి జిల్లా అధికారులకు నివేదిక పంపిస్తున్నట్లు తెలిపారు. చేతికొచ్చిన పంట నాశనం కావడంతో రైతు కృష్ణ ఆవేదన వ్యక్తం చేశారు. పంట నష్ట పరిహారం త్వరగా ఇప్పించాలని అధికారులను కోరారు. వేసని వచ్చిందంటే అటవీ పరిసర ప్రాంతాల్లో ఉన్న పంట పొలాల కు ఏను గుల బెడద తప్పడం లేదు. ఏనుగుల దాడి నుండి పంట పొలాలను కాపాడాలని రైతులు అధికారులను వేడుకుంటున్నారు.

గువ్వలచెరువు ఘాట్‌లో రోడ్డు ప్రమాదం



బొగ్గులారీని బయటకు తీస్తున్న క్రేన్

సికెదిన్నె, ఏప్రిల్ 16: కడప-రాయచోటి జాతీయ రహదారిలోని గువ్వలచెరువు ఘాట్‌లో మంగళవారం బ్రేక్ ఫెయిల్ కావడంతో బొగ్గు లారీ మరో వాహనాన్ని ఢీ కొందని సీకే దిన్నె సీఐ శివ శంకర్ నాయక్ తెలిపారు. రాయచోటి నుంచి కడపకు బొగ్గులోడుతో వస్తున్న లారీ బ్రేకులు ఫెయిల్ అయి అదుపు తప్పి కారుపై పడింది. దీంతో క్యాబిన్‌లో చిక్కుకు పోయిన కారు డ్రైవర్‌ను అగ్నిమాపక సిబ్బంది సహకారంతో రెండు క్రేన్లు, ఎక్స్‌కవేటర్, హైడ్రాలిక్ కట్టర్ల సాయంతో రక్షించి ఆస్పత్రికి తరలించామన్నారు. కార్యక్రమంలో సికెదిన్నె పోలీసులు, అగ్నిమాపక అధికారి బసివిరెడ్డి, సంజీవరాజు, సతీష్, మోహన్, జలీల్, కరిముల్లా, మురళీకృష్ణ, పవన్‌కుమార్, రమేష్‌నాయక్, శివశంకర్, శ్రీనివాసులరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

జూదరుల అరెస్ట్

రాయచోటిటౌన్, ఏప్రిల్ 16: రాయచోటి మండల పరిధిలోని మాధవరం గ్రామంలో సోమవారం రాత్రి పేకాట నిర్వహిస్తున్నట్లు సమాచారం అందుకున్న రాయచోటి అర్బన్ పోలీసులు మెరుపుదాడి చేసి 8 మందిని అరెస్టు చేయడంతో పాటు, రూ.27 వేలు నగదును స్వాధీనం చేసుకున్నారు. రాయచోటి అర్బన్ ఎస్ఐ భక్తవత్సలం ఆధ్వర్యంలో సోమవారం అర్ధరాత్రి పోలీసు సిబ్బంది మాధవరం కస్పాకు సమీపంలో ముళ్లపొదల్లో జూదం ఆడుతున్న 18 మందిని అరెస్టు చేశారు. మరో 10 మంది పరారైనట్లు పోలీసులు తెలిపారు. అరెస్టు చేసిన వారిలో హేమంత్ అనే వలంటీర్ ఉన్నట్లు తెలిపారు. జూదరుల నుంచి 52 పేక ముక్కలతో పాటు రూ.27 వేలు నగదు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు అర్బన్ సీఐ తెలియజేశారు.

సుగవాసి సోదరుల ప్రచారం

● రాజంపేట మున్సిపాలిటీని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానని వెల్లడి

రాజంపేటటౌన్/ సిద్దవటం, ఏప్రిల్ 16: రాజంపేట నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో మంగళవారం సుగవాసి సోదరులు ప్రచారం నిర్వహించారు. ఎమ్మెల్యే అభ్యర్థి సుగవాసి బాలసుబ్రమణ్యం వీరబల్లి, రాజంపేట పట్టణంలో ప్రచారం నిర్వహించారు. రాష్ట్ర టీడీపీ కార్యనిర్వహక కార్యదర్శి చెన్నూరు సుధాకర్ ఆధ్వర్యంలో రాజంపేట పట్టణంలోని పాతపోలీసులైను వీధి, ఆకుల వీధి, కొలిమి వీధి ప్రాంతాల్లో టీడీపీ నేతలు ఇంటింటా ప్రచారం నిర్వహించారు. సూపర్ సిక్స్ పథకాలపై వివరించారు. సైకిల్‌కు ఓటు వేయాలని అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల పార్టీ మాజీ అధ్యక్షుడు కొండయ్య నాయుడు, వెంకటేశ్వర్లనాయుడు, గీతాంజలి కళాశాల కరస్పాండెంటు ఎస్.వి.రమణ, బలిజ సంఘం జిల్లా అధ్యక్షుడు టైల్స్ నరసింహ, మైనార్టీ నాయకులు అబుబకర్, పట్టణ మాజీ అధ్యక్షుడు సంజీవరావు, లీగల్ సెల్ అధ్యక్షుడు టి.లక్ష్మీనారాయణ, మన్నూరు నాయకులు, ఆడిటర్ మురళీ కృష్ణ, మాజీ కౌన్సిలర్లు గుగ్గిళ్ల చంద్రమౌళి, మనుబోలు వెంకటేశ్వర్లు, ముమ్మడి చిన్నయ్య, జిల్లా టీడీపీ అధికార ప్రతినిధి అమ్మినేని విజయభాస్కర్, రాష్ట్ర కార్యదర్శి ఇడిమడకల కుమార్, మహిళా నేతలు పిడికిటి రత్నకుమారి, మాజీ జెడ్పీటీసీ చెన్నూరు సరస్వతి, టీడీపీ జిల్లా ఉపాధ్యక్షురాలు వాణి, జనసేన పార్టీ నాయకులు వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు. సుండుపల్లిలలో సుగవాసి బాలసుబ్రమణ్యం సోదరులు, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వహక కార్యదర్శి సుగవాసి ప్రసాద్‌బాబు ఇంటింటా ప్రచారం నిర్వహించారు. సుండుపల్లి మండల కేంద్రం, ఆర్యవైశ్య పురం, అగ్రహారం తదితర గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. సుండుపల్లె మండల పార్టీ నాయకులు రెడ్డెప్ప తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా సిద్దవటంలో బాలసుబ్రమణ్యం చిన్నాన్న కుమారుడు సుగవాసి జానకీరామ్ ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి నాగమునిరెడ్డి, క్లస్టర్ ఇన్‌చార్జి దశరథ రామనాయుడు, మండల అధ్యక్షుడు మోహన్‌రెడ్డి, సింగిల్‌విండో అధ్యక్షుడు జగదీశ్వర్ పాల్గొన్నారు.



సుండుపల్లిలో సుగవాసి ప్రసాద్‌కు మంగళహారతులు ఇస్తున్న మహిళలు

టీడీపీతోనే మహిళలకు భద్రత

సుండుపల్లె: టీడీపీతోనే మహిళలకు భద్రత లభిస్తుందని, టీడీపీ అధికారంలోకి రాగానే నిరుద్యోగులకు నెలకు రూ.3 వేలు ఆర్థిక సహాయాన్ని ఉద్యోగం వచ్చే వరకు ప్రభుత్వం అందిస్తుందని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సుగవాసి ప్రసాద్‌బాబు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ఆనందనగర్, కృష్ణానగర్, సంతవీధి, మసీదు వీధుల్లో ఇంటింటి ప్రచారాన్ని నిర్వహించారు. రాష్ట్రంలో జరుగుతున్న అరాచకాలను, అక్రమాలను అరికట్టాలంటే ఎన్‌డీఏ కూటమి అధికారంలోకి రావాలన్నారు. రాజంపేట బీజేపీ ఎంపీ అభ్యర్థి నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి, టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బాలసుబ్రమణ్యంలను అఖండ మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు రెడ్డెప్ప, సానిపాయి సర్పంచ్ నేతి ఆంజినేయులు, చప్పిడి రమేశ్‌నాయుడు, ప్రసాద్‌రాజు, జనార్ధన్, యర్రంరెడ్డి, శివరామ్‌నాయుడు, ప్రతాప్‌రెడ్డి, చంద్రశేఖర్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

ముందస్తు జాగ్రత్తలతోనే అగ్ని ప్రమాదాలు దూరం

● రాయచోటి ఫైర్ ఆఫీసర్ వెంకట్రామిరెడ్డి

రాయచోటిటౌన్, ఏప్రిల్ 16: ముందస్తు జాగ్రత్తలతోనే అగ్ని ప్రమాదాలను దూరం చేయవచ్చనని రాయచోటి ఫైర్ ఆఫీసర్ వెంకట్రామిరెడ్డి సూచించారు. మంగళవారం రాయచోటి పట్టణంలోని మాసాపేటలో గల సుగవాసి రాజారాం జడ్పీ ఉన్నత పాఠశాలలో అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటి వేసవిలో నానాటికి పెరిగిపోతున్న ఉష్ణోగ్రత వల్ల భూతాపం పెరిగి అగ్ని ప్రమాదాలు జరిగే అవకాశం ఎక్కువగా ఉన్న నేపథ్యంలో విద్యార్థులకు అగ్ని ప్రమాదాల నివారణ, అవి జరిగినప్పుడు ఆస్తి, ప్రాణనష్టం జరగకుండా కాపాడుకోవాల్సిన పద్ధతులపై అవగాహన కల్పించారు. జిల్లా విపత్తు స్పందన, అగ్నిమాపక సేవలశాఖ ఆధ్వర్యంలో రాయచోటి ఫైర్‌స్టేషన్ ఫైర్ ఆఫీసర్ వెంకట్రామిరెడ్డి సిబ్బందితో కలిసి పాఠశాల ప్రాంగణంలో వివిధ అగ్ని ప్రమాదాలు జరిగే రీతి వాటి నివారణకు అవలంబించే పద్ధతులను చక్కటి ప్రదర్శనతో విద్యార్థులకు వివరించారు. ఈ సందర్భంగా పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయురాలు జానకీ మాట్లాడుతూ కొంత ముందస్తు జాగ్రత్తతో గృహాల్లోనూ, ఆరు బయట జరిగే అగ్ని ప్రమాదాలను నివారించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు జగదీశ్వరయ్య, మనోహర్‌రెడ్డి, ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



మాసాపేట హైస్కూల్‌లో అగ్ని ప్రమాదాలపై అవగాహన కల్పిస్తున్న ఫైర్ సిబ్బంది

ఉత్సవ విగ్రహాల సమర్పణ

పెనగలూరు, ఏప్రిల్ 16: మండలంలోని కంబాల కుంట బీసీ కాలనీలో నూతనంగా నిర్మించిన రామాలయానికి దాతలు సీతారామ, లక్ష్మణ, ఆంజనేయస్వాముల ఉత్సవ విగ్రహాలను సమర్పించుకున్నట్లు వారు తెలిపారు. ఇదే గ్రామానికి చెందిన తిక్కా జయరాం, వెంకటలక్ష్మీ, తిక్కా మల్లికార్జున, లక్ష్మీదేవి కుటుంబ సభ్యుల ఆర్థిక సహకారంతో వీటిని ఏర్పాటు చేశారు. ప్రముఖ పుణ్యక్షేత్రం తిరుపతి నగరంలో విగ్రహాలను తయారు చేయించినట్లు వారు తెలిపారు.



ఉత్సవ విగ్రహాలను అందజేస్తున్న దృశ్యం

నేడు సీతారాముల కల్యాణం

పెనగలూరు, ఏప్రిల్ 16: మండలంలోని ఓబిలి గ్రామ పంచాయతీ పరిధిలోని అత్తిగారిపల్లె రామాలయంలో సీతారాముల కల్యాణోత్సవం జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. హైదరాబాదులో స్థిరపడిన నలమారు చంద్రశేఖర్‌రెడ్డి కుటుంబ సభ్యులు ఈ కల్యాణోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు.

21న ప్రవేశ పరీక్ష

లక్కిరెడ్డిపల్లె, ఏప్రిల్ 16: లక్కిరెడ్డిపల్లె ఏపీ మోడల్ స్కూల్‌లో 6వ తరగతి ప్రవేశానికి ఈ నెల 21న ఆదివారం పరీక్ష నిర్వహిస్తున్నట్లు పాఠశాల ప్రిన్సిపల్ కోమటిరెడ్డి శివశంకర్‌రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 6వ తరగతి ప్రవేశానికి దరఖాస్తులు చేసుకున్న విద్యార్థులు ఆన్‌లైన్‌లో హాల్‌టికెట్లు పొంది పరీక్షకు హాజరు కావాలన్నారు. ఉదయం 9 గంటలకు పరీక్ష కేంద్రానికి హాజరు కాలని, 10-12 గంటల వరకు పరీక్ష జరుగుతుందని ఆయన తెలిపారు.

ఉచితంగా మెటీరియల్ వితరణ

ప్రొద్దుటూరు టౌన్, ఏప్రిల్ 16: జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో పాలిసెట్ పరీక్షకు సిద్ధమవుతున్న విద్యార్థులకు ఉచితంగా మెటీరియల్ పంపిణీ చేశారు. మంగళవారం పీవీఆర్ ఇన్‌స్టిట్యూట్ నిర్వాహకులు రమణ శిక్షణ పొందుతున్న 120 మంది విద్యార్థులకు ఫిజిక్స్, మేథమేటిక్స్ మెటీరియల్‌ను అందజేశారు. ఈ కార్యక్రమంలో జేవీవీ జిల్లా గౌరవాధ్యక్షుడు గోపీనాథరెడ్డి, తవ్వా సురేష్, రాజశేఖర్, సునీత, దేవమణి, ప్రియాంక పాల్గొన్నారు.

రైల్వేకోడూరులో ముమ్మరంగా ప్రచారం

రైల్వేకోడూరు, ఏప్రిల్ 16: నియోజకవర్గంలో కూటమి అభ్యర్థి అరవ శ్రీధర్ ముమ్మరంగా ప్రచారం నిర్వహిస్తున్నారు. మంగళవారం రైల్వేకోడూరు మండలంలోని లక్ష్మీగారిపల్లె, అబ్బినాయుడుపల్లి, యానాదిపల్లె, అరుంధతివాడ, మార్గోపల్లి, అరుంధతివాడ, ఎస్‌వీఎస్ గిరిజనకాలనీ తదితర గ్రామాల్లో టీడీపీ ఇన్‌ఛార్జ్ ముక్కా రూపానందరెడ్డి ఆధ్వర్యంలో ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల్లో మార్పు వచ్చిందని, వైసీపీపై తీవ్రమైన వ్యతిరేకత ఉందన్నారు. వైసీపీ దాడులకు, బెదిరింపులకు భయపడేది లేదన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు బాల, వాకచర్ల సుబ్బారావు, టీడీపీ నాయకులు ఎస్‌వీ గోపాల్, చంద్ర, జనసేన నాయకులు పగడాల వెంకటేష్, పగడాల చంద్రశేఖర్, మండల పార్టీ అధ్యక్షుడు కొమ్మాశివ, మహిళా సర్పంచులు శివశైలజ, కారుమంచి సంయుక్త, హస్తి సుప్రజ పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరిస్తాం : ముక్కా శిరీషా



శెట్టిగుంట చెక్కబొమ్మల కార్మికుల కష్టాలను తెలుసుకుంటున్న శిరీషా

టీడీపీ ఇన్‌ఛార్జ్ ముక్కా రూపానందరెడ్డి చిన్న కోడలు ముక్కా శిరీషా మంగళవారం రైల్వేకోడూరు మండలంలో పలు గ్రామాల్లో కూటమి బలపరిచిన జనసేన పార్టీ అభ్యర్థి అరవ శ్రీధర్ విజయం కోసం ముమ్మరంగా తిరుగుతున్నారు. టీడీపీ అధికారంలోకి రావాలని, సీఎంగా చంద్రబాబునాయుడును ప్రజలు చూడాలని, రాష్ట్రంలో సుస్థిరమైన పాలన ప్రజలకు అందించేందుకు ప్రచారం చేస్తున్నారు. మండలంలోని లక్ష్మీగారిపల్లెలో చెక్కబొమ్మల కార్మికుల సమస్యలను విని టీడీపీ అధికారంలోకి రాగానే కార్మికుల సమస్యలను పరిష్కారం చేస్తామని ఆమె హామీ ఇచ్చారు.

తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు



మండల పరిషత్ సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో

పెనగలూరు, ఏప్రిల్ 16: మండలంలో తీవ్రమైన వేసవి దృష్ట్యా గ్రామాలలో నెలకొన్న తాగునీటి ఎద్దడిని ఎప్పటికప్పుడు యుద్ధప్రాతిపదికన పరిష్కరించేందుకు చర్యలు చేపడుతున్నామని ఎంపీపీ కొండూరు సౌందర్య, వైస్ ఎంపీపీ కె.విజయరెడ్డిలు అన్నారు. మంగళవారం మండల పరిషత్ సభాభవనంలో ఎంపీపీ కొండూరు సౌందర్య అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో నెలకొన్న తాగునీటి సమస్యను యుద్ధప్రాతిపదికన పరిష్కరించేందుకు చర్యలు చేపడుతున్నామన్నారు. అనంతరం ఎంపీడీవో హరిప్రసాద్‌రెడ్డి మండల అజెండాను చదివి వినిపించారు. ఈ సందర్భంగా పలు శాఖల అధికారులు తమ ప్రగతిని చదివి వినిపించారు. ఈ సమావేశంలో జడ్పీటీసీ యు.పి.సుబ్బరాయుడు, వైస్ ఎంపీపీ-2 బి.రోశయ్య, కోఆప్షన్ సభ్యుడు లాడెన్, ఐకేపీ ఏరియా కో-ఆర్డినేటర్ నిరంజన్‌కుమార్, హౌసింగ్ కార్పొరేషన్ ఏఈ హరిప్రసాద్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ విజయకుమారి తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికలపై అవగాహన సదస్సు

రైల్వేకోడూరు(రూరల్), ఏప్రిల్ 16: ఎన్నికల్లో అధికారులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎన్నికల నోడల్ అధికారి సత్యనారాయణ రావు తెలిపారు. మంగళవారం మండలంలోని అనంతరాజుపేట ఉద్యాన కళాశాలలో పోలింగ్ అధికారులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఎన్నికల సమయంలో పోలింగ్ అధికారులకు పూర్తి బాధ్యతలు ఉంటాయని, అవాంఛనీయ సంఘటనలు జరిగినప్పుడు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎన్నికల నియమ నిబంధనలను ప్రతిఒక్కరూ తూచా తప్పకుండా పాటించాలని హెచ్చరించారు. కాగా ఈవీఎం పనితీరుపై అధికారులకు పలు సూచనలు సలహాలు ఇచ్చారు. ఈ కార్యక్రమలో నియోజకవర్గ ఎన్నికల అధికారి టి.లీలారాణి నియోజకవర్గ ఎన్నికల అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థిని ఆత్మహత్యపై సమగ్ర విచారణ జరిపించాలి

● ఎస్పీ కృష్ణారావుకు ఆర్ఎస్‌యూ నాయకుల వినతి

రాయచోటిటౌన్, ఏప్రిల్ 16: రాజంపేట పట్టణంలోని బోయనపల్లిలో ఉన్న అన్నమాచార్య ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థిని రేణుక మరణంపై సమగ్ర విచారణ జరిపించి విద్యార్థిని తల్లిదండ్రులకు న్యాయం చేయాలని రెవల్యూషనరీ స్టూడెంట్స్ యూనియన్ (ఆర్ఎస్‌యూ) రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రశాంత్ డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన ఎస్పీ కృష్ణారావును కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ప్రశాంత్ మాట్లాడుతూ విద్యార్థిని మధ్యాహ్నం భోజనం చేసి రూమ్‌లోకి వెళ్లి ఫ్యాన్‌కు ఉరి వేసుకుని చనిపోయిందని ఆ కళాశాల యాజమాన్యం ఒత్తిడి వల్లే బాలికల ఆత్మహత్య చేసుకుందని విద్యార్థి సంఘంగా మేము ఆరోపిస్తున్నామన్నారు. సంఘటన జరిగిన వెంటనే విద్యార్థిని తల్లిదండ్రులకు గానీ, పోలీసులకు గానీ, ఎటువంటి సమాచారం ఇవ్వకుండా దాచిపెట్టి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి వంశీ, నాయకులు సాయిమహేశ్, రవి తదితరులు పాల్గొన్నారు.



ఎస్పీ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న ఆర్ఎస్‌యూ నేతలు

ఫ్యాన్సీస్టోర్‌లో నగదు చోరీ

కొండాపురం, ఏప్రిల్ 16: మండలంలోని కె.సుగుమంచిపల్లె గ్రామం సమీపంలో ప్రధానరోడ్డుపై ఉన్న సుధాకర్ ఫ్యాన్సీస్టోర్‌లో సోమవారం రాత్రి నగదు, సెల్‌ఫోన్ చోరీకి గురైంది. ఫ్యాన్సీస్టోర్ షట్టర్‌కు ఉన్న బీగాన్ని పగులగొట్టకుండా మరోక తాళంతో తీసి నగదు తీసుకెళినట్లు స్థానికులు తెలిపారు. ఈ సంఘటనపై విచారిస్తున్నట్లు తాళ్లప్రొద్దుటూరు ఎస్సై చంద్రశేఖర్ తెలిపారు.

అగ్నిమాపక వారోత్సవాలపై అవగాహన



అగ్నిప్రమాదాలపై అవగాహన కల్పిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

రాజంపేటటౌన్, ఏప్రిల్ 16: రాజంపేట మండలం జవహర్ నవోదయ విద్యాలయంలో అగ్నిమాపక అధికారి కె.మాబూ సుభాన్ ఆధ్వర్యంలో మంగళవారం అగ్నిమాపక వారోత్సవాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అగ్నిప్రమాదాలు జరిగేటప్పుడు అగ్నిప్రమాదాలను అరికట్టే అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డెమో చేయించారు. ఉపాధ్యాయులకు, విద్యార్థులకు ఈ అంశాలు వెల్లడించారు. ఎక్కడైనా అగ్ని ప్రమాదాలు జరిగితే 08565-240299 లేదా 101 లేదా 9963479554 నెంబర్లకు సమాచారం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ గీతా, ఫైర్ హెడ్‌కానిస్టేబుల్ సుబ్రమణ్యం, శివ, శివయ్య, నాగూర్ బాష, వెంకటసుబ్బయ్య, రాజేశ్వర, రమేష్, చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాదాలపై అవగాహన పెంచుకోవాలి

లక్కిరెడ్డిపల్లె, ఏప్రిల్ 16: అగ్నిప్రమాదాలపై ప్రతిఒక్కరూ అవగాహన పెంచుకోవాలని అగ్నిమాపక ఫైర్ ఆఫీసర్ సుదర్శన్ రెడ్డి పేర్కొన్నారు. అగ్నిమాపక వారోత్సవాలల్లో భాగంగా మంగళవారం స్థానిక విశ్వభారతి హైస్కూల్ అగ్నిప్రమాదాలపై విన్యాసాలు రూపంలో విద్యార్థులకు వివరించారు.ఈ సందర్భంగా వేసవిలో ఎండలు ఎక్కువగా ఉండడం వలన అగ్నిప్రమాలు జరిగే అవకాశాలు ఉన్నాయని అగ్నిప్రమాదాలు జరిన వెంటనే 101 టోల్‌ఫ్రీ నెంబరుకు పోన్ చేస్తే సంఘటన స్థలానికి చేరుకొని మంటలను అరికడతామన్నరు. పరిశ్రమలలో అగ్ని ప్రమాదాలు జరినపుడు ఎలా సమస్య నుండి బయట పడేవిదానం గురించి విన్యాసాలు చేసి వివరించారు. వంటగ్యాస్ లీక్ అయినపుడు తీసుకోవాల్సిన జాగ్రతలు గురించి విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ రఘునాధరాజు, ఉపాధ్యాయులు గంగరాజు, చంద్రాయుడు, ఫైర్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



అగ్నిప్రమాదాలపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

వీరేశలింగం జయంతి వేడుకలు

రాజంపేట,ఏప్రిల్ 16: రాజంపేట పట్టణంలో మంగళవారం సాయంత్రం సరస్వతీ విద్యామందిరంలో కందుకూరి వీరేశలింగం జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. తెలుగు భాష సంరక్షణ సమితి సహాయ కార్యదర్శి గంగనపల్లి వెంకటరమణ, మండల అధ్యక్షుడు రామచంద్రనాయుడు, సమితి ఉపాధ్యక్షుడు బి.వి.నారాయణరాజు, సంస్థ ప్రతినిధులు హాజరై వీరేశలింగం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రముఖ కవి, రచయిత, నాటక కర్త, నవలాకారుడు, కథారచయిత వీరేశలింగం పంతులు జయంతి వేడుకలు నిర్వహించడం ఆనందదాయకమన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కోడూరు గౌరీ, కృష్ణమూర్తి, దయాకర్, సుబ్రమణ్యం, కళ్యాణి, శ్రావణి తదితరులు పాల్గొన్నారు.



వీరేశలింగం పంతులు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న వెంకటరమణ తదితరులు

ఉమ్మడి అభ్యర్థిని గెలిపించండి

ఒంటిమిట్ట, ఏప్రిల్ 16: కాంగ్రెస్, కమ్యూనిస్టుల ఉమ్మడి అభ్యర్థిని గెలిపించాలని కమ్యునిస్ట్ పార్టీ అభ్యర్థి బుక్కే విశ్వనాధనాయక్ కోరారు. ఈ మేరకు ఓటు వేయాలని మంగళవారం ఒంటిమిట్టలో ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. వైసీపీ, టీడీపీ ఇరు పార్టీలు ప్రజలను మోసం చేశాయని, రాష్ట్రంలోని ప్రజా సమస్యలు గాలికి వదిలేశాయన్నారు. నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు, సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం, రైతులకు గిట్టుబాటు ధర వంటివి ఉమ్మడి కాంగ్రెస్ అభ్యర్థి గెలవడం ద్వారా సాధ్యమవుతుందని వారు ప్రజలకు అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు చిట్వేలి రవికుమార్, మహేష్, కట్టా యానాదయ్య, కోనేటి నరసయ్య, పలువురు సీపీఐ నాయకులు పాల్గొన్నారు.



ప్రచారం నిర్వహిస్తున్న సీపీఐ నాయకులు

ఉపాధి సిబ్బంది ప్రచారంలో పాల్గొంటే చర్యలు



సమావేశంలో మట్లాడుతున్న ఎంపీడీవో ప్రభాకర్

రామాపురం, ఏప్రిల్ 16: మండలంలోని 13 గ్రామ పంచాయతీ పరిధిలోని ఉపాధి సిబ్బంది, వలంటీర్లు ఎన్నికల ప్రచారాల్లో పాల్గొంటే చర్యలు తప్పవని ఎంపీడీవో ప్రభాకర్ తెలిపారు. స్థానిక ఉపాధి కార్యాలయంలో మంగళవారం సాయంత్రం ఉపాధి సిబ్బందికి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో కూలీలకు ఉపాధి పనులు కల్పించాలన్నారు. పనులు చేసేటప్పుడు నాణ్యతగా చేయాలన్నారు. కూలిపని కల్పించాలని అడిగిన వెంటనే వారికి పనులు కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీవో సురేంద్రనాథ్‌రెడ్డి, టీఏలు, ఫీల్డ్ సిబ్బంది పాల్గొన్నారు.

‘టీడీపీతోనే సమన్యాయం’

గాలివీడు, ఏప్రిల్ 16: టీడీపీ అధికారంలో ఉన్నప్పుడే అన్ని వర్గాల వారికి సమన్యాయం జరిగిందని మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి సోదరుడు లక్ష్మీప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. ఆయన మంగళవారం తన అన్నకు మద్దతుగా మండలంలోని గరుగుపల్లె పంచాయతీలో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు అభివృద్ధితో పాటు సంక్షేమం జరిగిందని కొనియాడారు. తిరిగి చంద్రబాబు ముఖ్యమంత్రి అయితే అందరికీ సమన్యాయం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు పుల్లయ్య, ఆదిరెడ్డి, రామచంద్రారెడ్డి, నాగేశ్వరరావు, వెంకటశివారెడ్డి, మౌలాలి తదితరులు పాల్గొన్నారు.

ఐదేళ్లలో నియోజకవర్గానికి చేసిందేమీ లేదు

● రాజంపేట సీపీఐ ఎమ్మెల్యే అభ్యర్థి విశ్వనాథ్‌నాయక్

సుండుపల్లె, ఏప్రిల్ 16: గడిచిన ఐదేళ్లలో నియోజకవర్గ ప్రజలకు వైసీపీ ప్రభుత్వం చేసిందేమీ లేదని రాజంపేట సీపీఐ ఎమ్మెల్యే అభ్యర్థి బుక్కే విశ్వనాథ్ నాయక్ తెలిపారు. మంగళవారం మడితాడు, సుండుపల్లె గ్రామ పంచాయతీల్లో ఇంటింటి ప్రచారాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ, ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.











మహాజ్ఞాన స్వరూపేచ హనుమాన్ అంజనాసుత:
కాలజ్ఞాన స్వరూపేచ హనుమాన్ రామభక్త :
బ్రహ్మజ్ఞాన స్వరూపేచ హనుమాన్ వాయు సుత:
నమామి కపీశం శరణం శరణం శరణం
రామభక్త శరణం మమ

శ్రీ రామనవమి శుభాకాంక్షలు



" శ్రీరామ రామ రామేతి రమే రామే మనోరమే ।
సహస్రనామ తత్తుల్యం రామనామ వరాననే ॥ "

శ్రీరాముడు అంటే దైవ స్వరూపం మాత్రమే కాదు ... తరతరాలుగా భారతీయులకు జీవన గమనాన్ని బోధిస్తున్న మానవ స్వరూపం కూడా.

భారతీయ కుటుంబ వ్యవస్థకు ప్రతిబింబంగా ... పితృవాక్య పరిపాలకుడిగా, సత్యవాక్య పాలకుడిగా, ఏకపత్ని వ్రతుడిగా, సోదరులకు, తనను నమ్మినవారికి ఆప్యాయతను పంచినవాడిగా, ఆదర్శ పాలకుడిగా మనకు ఆదర్శంగా నిలిచాడు. ప్రతి అడుగులోను ఆదర్శవంతమైన జీవితాన్ని గడిపిన పురుషోత్తముడు.

హక్కులను పొందడం కంటే ముందు మన బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించాలని బోధించిన మర్యాద పురుషోత్తముడైన రాముడు మన అందరికీ ఆదర్శ ప్రాయుడయ్యాడు.

రాముడి బోధనల స్ఫూర్తితో మనమంతా వివక్షలేని సంక్షేమ, స్వశక్తి, సుదృఢమైన నవభారత నిర్మాణంలో భాగస్వామ్యులం అవ్వాలని ప్రతినబూనుదాం



కొండా నరేంద్ర

KONDA NARENDRA, M.S. [USA]

పారిశ్రామిక వేత్త, సామాజిక వేత్త, మానవతా వాది

తంబళ్లపల్లె నియోజకవర్గం

తంబళ్లపల్లె నియోజకవర్గ ప్రజలు మరియు అన్నమయ్య జిల్లా ప్రజలకు, మిత్రులు, శ్రేయోభిలాషులకు పేరుపేరున

శ్రీ రామనవమి శుభాకాంక్షలు

ఇట్లు - మీ సేవకుడు.... కొండా నరేంద్ర

మద్యం అక్రమ విక్రయాలపై తనిఖీలు

మదనపల్లె టౌన్, ఏప్రిల్ 16: మదనపల్లె డివిజన్‌లో మద్యం అక్రమ విక్రయాలపై ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు ముమ్మర దాడులు నిర్వహించారు. డివిజన్ పరిధిలో మధ్యాహ్ననికే ప్రభుత్వ మద్యం దుకాణాలు మూతపడటం, కొన్ని చోట్ల ప్రభుత్వ మద్యం దుకాణాల్లోని సేల్స్‌మెన్ అక్రమంగా మద్యం బయటకు తరలించి విక్రయిస్తుండటంపై ఎస్ఈబీ పోలీసులు కేసులు నమోదు చేసిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో కలెక్టర్ ఆదేశాలతో జిల్లా వ్యవసాయాధికారి చంద్రానాయక్ ఆధ్వర్యంలో ఫ్లయింగ్‌స్క్వాడ్‌ను నియమించారు. ఈ స్క్వాడ్ అధికారులు సోమ, మంగళవారాల్లో మదనపల్లె డివిజన్‌లోని మదనపల్లె, బి.కొత్తకోట, పీటీఎం, ములకలచెరువులోని మద్యం దుకాణాలను తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. తనిఖీ బృందంలో డీటీ జయసింహ, ఎక్సైజ్ ఎస్ఐ పి.రామకృష్ణ ఎస్ఐ గాయత్రి, జీఎస్టీవో అధికారి హేమం త్‌కుమార్ పాల్గొన్నారు.

మద్యం ప్యాకెట్లు స్వాధీనం.. వ్యక్తి అరెస్ట్

పెద్దతిప్పసముద్రం ఏప్రిల్ 16 : అక్రమంగా కర్ణాటక మద్యం తరలిస్తున్న క్రిష్ణప్ప అనే వ్యక్తిని అరెస్ట్ చేసి 68 మద్యం ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ రవీంద్రబాబు తెలిపారు. మద్దయ్యగారిపల్లె పంచాయతీ బూరుజుపల్లెకు చెందిన క్రిష్ణప్ప కర్ణాటక రాష్ట్రం నుండి మద్యం తరలించి ఒక్క చోట డంప్ చేసి విక్రయిస్తున్నట్లు సమాచారంతో కలసి తనిఖీలు చేపట్టి 68 మద్యం ప్యాకెట్లను స్వాదీనం చేసుకుని అతనిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి రిమాండుకు పంపుతున్నట్లు ఎస్ రవీంద్రబాబు తెలిపారు.

వృద్ధురాలి మెడలో గొలుసు లాక్కెళ్లిన దుండగులు

గుర్రంకొండ, ఏప్రిల్ 16:అర్ధరాత్రి ఇంటిలో నిద్రిస్తున్న వృద్ధురాలి మెడలో ఉన్న బంగారు గొలుసును దుండగులు లాక్కెళ్లిన సంఘటన అమిలేపల్లెలో సోమవారం రాత్రి జరిగింది. బాధితురాలి వివరాల మేరకు మండలంలోని అమిలేపల్లె గ్రామా నికి చెందిన బి.ఉత్తమ్మ(65) ఒంటరిగా జీవనం సాగిస్తుంది. ఈ క్రమంలో సోమవారం రాత్రి 2 గంటల సమయంలో మొదటి అంతస్తులోని బాల్కానిలో ఉత్తమ్మ నిద్రిస్తుండగా గమనించిన దుండగుడు బాధితురాలి పక్కంటి వైపు నుంచి ఇంటిలోకి ప్రవే శించి ఉత్తమ మెడలో ఉన్న బంగారు గొలుసును కట్టర్‌తో కత్తి రించి లాగే సమయంలో మేల్కొన్న బాధితురాలు ప్రతిఘటించింది. అయితే దుండగులు వృద్ధురాలుని తోసేసి పారిపోయారు. బాధితురాలి గట్టిగా అరవడంతో చుట్టు పక్కల వారు వచ్చేలోపు నిందితులు పరారయ్యారు. దుండగులు లాక్కెళ్లిన బంగారు గొలుసు బరువు 30 గ్రాములు ఉంటుందని తెలిపింది. బంగారు గొలుసు విలువ రూ.2 లక్షలు ఉంటుందని బాధితురాలి తెలుపుతుంది. జరిగిన విషయాన్ని బాధితురాలు స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేసింది.

ట్రాక్టర్ కింద పడి వృద్ధుడికి గాయాలు

తంబళ్లపల్లె, ఏప్రిల్ 16: ట్రాక్టర్ కింద పడి సిద్దారెడ్డి(68) అనే వృద్ధుడు గాయపడిన సంఘటన మంగళవారం చోటుచేసుకుంది.తంబళ్లపల్లె మండలం గుండ్లపల్లె పంచాయతీ మొరుసుపల్లె బురుజుకు చెందిన సిద్దారెడ్డి సొంత పనుల నిమిత్తం తంబళ్లపల్లెకు వచ్చి తిరిగి స్వగ్రామానికి వెళ్లేందుకు నిలబడి ఉండగా వరి గడ్డి లోడుతో వచ్చిన ట్రాక్టర్ తగలడంతో ప్రమాదవశాత్తు వెనుక వైపు ట్రాలీ చక్రాల కింద పడిపోయాడు. ట్రాలీ చక్రాలు వృద్ధుడి కాలుపై ఎక్కడంతో కుడికాలు విరిగి రక్తస్రావమైంది. అక్కడే ఉన్న ప్రజలు 108లో తంబళ్లపల్లె ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వైద్యులు ప్రథమ చికిత్స అందించి మెరుగైన వైద్య చికిత్స కోసం మదనపల్లె జిల్లా వైద్యశాలకు రెఫర్‌చేశారు.

చంద్రబాబు పాలనలోనే మహిళలకు గౌరవం

● మహిళలపైనా అక్రమ కేసులు పెట్టిన ఏకైక ప్రభుత్వం వైసీపీనే..!
● పీలేరు కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి నల్లారి కిశోర్ కుమార్ రెడ్డి సతీమణి తనూజా రెడ్డి, కుమార్తె వైష్ణవి రెడ్డి


పీలేరులో ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న నల్లారి తనూజా రెడ్డి, వైష్ణవి రెడ్డి


కలికిరిలో టీడీపీ కండువాలు కప్పుకున్న శెట్టివారిపల్లె గ్రామస్థులు

పీలేరు, ఏప్రిల్ 16: టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు ప్రభుత్వ పాలనలోనే మహిళలకు గౌరవమర్యాదలు దక్కాయని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, పీలేరు నియోజకవర్గ టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి సతీమణి నల్లారి తనూజారెడ్డి పేర్కొన్నారు. పీలేరు పట్టణంలోని మదనపల్లె టర్నింగ్, ఇందిరా నగర్, సుధాసుధీర్ వీధి, అయ్యప్పరెడ్డి కాలనీ తదితర ప్రాంతాల్లో మంగళవారం ఆమె తమ కుమార్తె వైష్ణవి రెడ్డి, టీడీపీ, జనసేన శ్రేణులతో కలిసి బాబు ష్యూరిటీ.. భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ వైఫల్యాలు, ప్రజావ్యతిరేక విధానాలను బహిరంగ, సామాజిక మాధ్యమాల్లో ప్రశ్నించిన మహిళలపైనా కూడా అక్రమ కేసులు పెట్టి జైలుపాలు చేసిన ఏకైక ప్రభుత్వం వైసీపీ ప్రభుత్వమని తనూజా రెడ్డి ధ్వజ మెత్తారు. అన్నదమ్ముల గొడవలు, సివిల్ తగాదాల్లో సైతం కలుగజేసుకుంటున్న అధికార పార్టీ నాయకులు ఆయా కుటుంబాల్లోని మహిళలపై భౌతిక దాడులకు పాల్పడుతూ వారి భయభ్రాంతులకు గురిచేస్తున్నారన్నారు. సంపూర్ణ మద్యనిషేధం చేస్తానని గత ఎన్నికల సందర్భంగా మహిళలకు మాట ఇచ్చిన సీఎం జగన్, అధికారంలోకి వచ్చాక మద్యాన్ని తమ ప్రధాన ఆదాయ వనరుగా మార్చుకున్నారని విమర్శించారు. కూటమి తరపున ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్న నల్లారి కిశోర్ కుమార్ రెడ్డి, ఎంపీగా పోటీ చేస్తున్న నల్లారి కిరణ్ కుమార్ రెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. సూపర్ సిక్స్ పథకాలతో కూడిన కరపత్రాలు పంచుతూ ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన నాయకులు పాల్గొన్నారు.

సర్పంచుల నిధులు దోచుకుంటున్న వైసీపీకి బుద్ధి చెప్పాలి

కలికిరి, ఏప్రిల్ 16: కేంద్ర ప్రభుత్వం విడుదల చేస్తున్న రూ.వేల కోట్ల నిధులను సర్పంచులకు దక్కకుండా దోచుకుంటున్న వైసీపీ ప్రభుత్వానికి ఎన్నికల్లో బుద్ధి చెప్పాలని పీలేరు కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి పిలుపునిచ్చారు. గుర్రంకొండ మండలం శెట్టివారిపల్లె పంచాయతీ సర్పంచు నారా వెంకట్రమణ, సీనియర్ టీడీపీ నాయకుడు మహబూబ్ బాషాల ఆధ్వర్యంలో పలువురు వైసీపీ కార్యకర్తలు మంగళవారం నగిరిపల్లెలో టీడీపీలో చేరారు. వారందరికీ కండువాలను కప్పి పార్టీలోకి స్వాగతించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్పంచులకే అన్యాయం చేసిన వైసీపీకి తగిన గుణపాఠం చెప్పేందుకు పార్టీ రహితంగా కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో వెంకట్రమణ, మహబూబ్ బాషాల సమక్షంలో ఎన్.బాలరాజు, పి.రామ్‌కుమార్, వై.రెడ్డెప్ప, పి.రెడ్డెప్ప, ఎల్.నరసింహులు, ఎస్.అక్కులప్ప, ఎ.తిమ్మయ్య, పి.రమణ, టి.నరసింహులు, టి.లక్ష్మీపతి, ఎన్.సోమిశెట్టి, పి.మహబూబ్ బాషా, ఎస్.శేఖర, సి.లోకేష్, ఎన్.భాస్కర తదితరులు టీడీపీలో చేరిన వారిలో వున్నారు.

రైతుల సమస్యలు పరిష్కరిస్తాం

మదనపల్లె టౌన్, ఏప్రిల్ 16: టీడీపీ అధికారంలోకి వస్తూనే టమోటా రైతులు, హమాలీల సమస్యలు పరిష్కరిస్తామని టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి షాజహాన్‌బాషా పేర్కొన్నారు. మంగళవారం స్థానిక టమోటా మార్కెట్‌లో టీడీపీ మైనారిటి విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎస్‌పీ మస్తాన్, నియోజకవర్గ బీసీ అధ్యక్షుడు నాగయ్య ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షుడు శ్రీరామ్‌చిన బాబు, మండీ యజమానులు పాల్గొన్నారు. ఎమ్మార్పీఎస్ నేత ఎస్.నరేంద్రబాబును, ఆరేటి వాసును ఆయన కలిశారు.

ఘనంగా కందుకూరి జయంతి

వాల్మీకిపురం, ఏప్రిల్ 16: సంఘసంస్కర్త, కందుకూరి వీరేశలింగం పంతులు జయంతి ని జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఘనంగా జరుపుకున్నారు. గండబోయ నపల్లె జడ్పీ ఉన్నత పాఠశాలలో కందుకూరి వీరేశలింగం చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు.

పీలేరులో ప్రారంభమైన శ్రీరామనవమి ఉత్సవాలు

పీలేరు, ఏప్రిల్ 16: శ్రీరామ నవమి ఉత్సవాలు పీలేరులో మంగళవారం సాయంత్రం ఘనంగా ప్రారంభమయ్యాయి. పట్టణంలోని ప్రకాశం రోడ్డులో ఉన్న కోదండ రామ స్వామి, సదుం రోడ్డులోని కల్యాణ సీతారామస్వామి ఆలయాల్లో పూజా కార్యక్రమాలతో ఉత్సవాలను ఆయా ఆలయాల కమిటీ సభ్యులు ఆరంభించారు. స్థానిక వినాయక స్వామి ఆలయం నుంచి ముత్తైదువులు సదుం రోడ్డులోని కల్యాణ సీతారామస్వామి ఆలయానికి పవిత్ర జలాలను మంగళవాయిద్యాల నడుమ ఊరేగింపుగా తరలించి ఆ జలాలతో స్వామి, అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలకు అభిషేకం నిర్వహించారు. కోదండరామస్వా మి ఆలయంలో పుణ్యావహచనం నిర్వహించారు. స్వామి, అమ్మవార్ల కల్యాణోత్సవాన్ని బుధవారం అంగరంగ వైభవంగా జరిపేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఆయా ఆలయాల కమిటీ సభ్యులు తెలిపారు. ఉత్సవాల కోసం ఆలయాలు ముస్తాబయ్యాయి,

కూటమి ప్రభుత్వం వస్తూనే మహిళలకు పెద్దపీట

●తంబళ్లపల్లె ఉమ్మడి అభ్యర్థి దాసరిపల్లి జయచంద్రారెడ్డి


జయహో బీసీ సదస్సులో మాట్లాడుతున్న ఉమ్మడి అభ్యర్థి దాసరిపల్లి జయచంద్రారెడ్డి

పెద్దమండ్యం, ఏప్రిల్ 16: రాష్ట్రంలో టీడీపీ బీజేపీ, జనసేన కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే మహిళలకు ఉచిత బసు సౌకర్యంతో పాటు వారి సంక్షేమానికి పెద్దపీట వేస్తారని తంబళ్లపల్లి టీడీపీ జనసేన బీజేపీ ఉమ్మడి అభ్యర్థి దాసరిపల్లి జయచంద్రారెడ్డి పేర్కొన్నారు. పెద్దమండ్యం మండలం మండలవారిపల్లి లో మంగళవారం జయహో బీసీ సదస్సులో జయచంద్రారెడ్డి మాట్లాడుతూ తంబళ్లపల్లి ఎమ్మెల్యేగా గెలిపిస్తే నియోజక వర్గంలో పరిశ్రమలు తెచ్చి అభివృద్ధి చేస్తానని తెలిపారు. ఎస్సీ ఎస్టీ బీసీ, మైనార్టీ కార్పొరేషన్ లోన్లు అమలు చేస్తామన్నారు. తంబళ్లపల్లి నియోజకవర్గ టీడీపీ జనసేన బీజేపీ ఉమ్మడి దాసరిపల్లి జయచంద్రారెడ్డి, రాజంపేట పార్లమెంట్ ఉమ్మడి అభ్యర్థి మాజీ సీఎం నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి గెలిపించాలని తంబళ్లపల్లి టీడీపీ జయహో బీసీ సదస్సుల పరిశీలకుడు తులసిధర్ నాయుడు కోరారు. పలు గిరిజన కుటుంబాలు టీడీపీ కండవాలు వేసుకొని టీడీపీ లోకి చేరారు. తంబళ్లపల్లి టీడీపీ సమన్వయకర్త నీడ్ మల్లికార్జున నాయుడు, రాష్ట్ర టీడీపీ బీసీ అధికార ప్రతినిధి పత్తికొండ త్యాగరాజ్, మండల సీనియర్ నేతలు వేణుగోపాల్ రెడ్డి, విశ్వనాధరెడ్డి, నేతలు సాంబ, ప్రభాకరరెడ్డి, నాగేశ్వరరెడ్డి, మోహన, సుబ్బరామిరెడ్డి, చెన్నక్రిష్ణ, శేషాద్రి పాల్గొన్నారు.

ములకలచెరువులో: టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు ష్యూరిటీతోనే రాష్ట్రానికి భవిష్యత్తు గ్యారంటీనని తంబళ్లపల్లె నియోజకవర్గ కూటమి ఉమ్మడి అభ్యర్థి దాసరిపల్లి జయచంద్రారెడ్డి సతీమణి కల్పనరెడ్డి, టీడీపీ మండల అధ్యక్షుడు పాలగిరి సిద్ధా పేర్కొన్నారు. పాత ములకలచెరువు పంచాయతీ రాగిమానిపల్లెలో బాబు ష్యూరిటీ..భవిష్యత్తు గ్యారెంటీ పథకాలపై మంగళవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ఉమ్మడి అభ్యర్థి జయచంద్రారెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించి నియోజకవర్గ అభివృద్ధికి సహకరిం చాలన్నారు. కార్యక్రమంలో బీసీ సెల్ అధ్యక్షుడు చెన్నకిష్టా, నాయీ బ్రాహ్మణ సాధికార సమితి జిల్లా కన్వీనర్ కేశవులు, ప్రధాన కార్యదర్శి వెంకటస్వామి, రామాంజులు, సోమశేఖర్, శ్రీరాములు, సుబహాన్, రవి, తుమ్మలప్ప, కేశవయ్య, ఆదినారాయణ, రమణ, రెడ్డెప్ప, సునితమ్మ, కాంతమ్మ పాల్గొన్నారు.

మాట తప్పిన జగన్‌ను ఓటుతో తరమండి

బి. కొత్తకోట, ఏప్రిల్16: గత ఎన్నికలకు ముందు మేనిఫెస్టో బైబిల్, ఖురాన్ అంటూ హామీలిచ్చి మాట తప్పిన జగన్‌ను ఓటుతో తరమాలని ఏపీసీసీ అధ్యక్షురాలు వైయస్ షర్మిల పిలుపునిచ్చారు. పార్టీ గెలుపు కోసం చేపట్టిన న్యాయయాత్రలో భాగంగా మంగళవారం రాత్రి అన్నమయ్య జిల్లా బి కొత్తకోట జ్యోతిచౌక్‌లో జరిగిన రోడ్‌షో లో ఆమె జగన్‌ను తూర్పారబట్టారు. మద్యనిషేదం చేస్తానని బీరాలు పలికి తానే మద్యం అమ్మించాడని అది కూడా కల్తీ మందులకు పేర్లు పెట్టి పేదల ఆరోగ్యంతో చెలగాటం ఆడాడన్నారు. రాష్ట్రంలో లిక్కర్ మాఫియా, ఇసుక మాఫియా, మయిన్స్ మాఫియా లను ఏర్పాటు చేసి దోచుకున్నారని విమర్శించారు. ప్రత్యేకహోదా కోసమే తాను కాంగ్రెస్‌లో చేరానని కేంద్రంలో అధికారంలోకి వస్తే ప్రత్యేకహోదా తీసుకువస్తానన్నారు. తంబళ్లపల్లె కాంగ్రెస్ అభ్యర్థి ఎంయస్ చంద్రశేఖర్ రెడ్డిని గెలిపించాలని ఓటర్లను కోరారు. సీపీఐ నాయకులు పీఎల్ నరసింహులు, శ్రీనివాసులు, మనోహర్‌రెడ్డిలు ప్రసంగించారు.

అభివాదంతో సరిపెట్టిన షర్మిల

కలికిరి, ఏప్రిల్ 16: ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల కలికిరిలో మంగళవారం ప్రజలకు నమస్కరిస్తూ అభివాదాలతోనే సరిపెట్టారు. పీలేరు నుంచి మదనపల్లెకు వెళుతూ మార్గమధ్యంలో బస్సు దిగకుండానే ప్రజలకు అభివాదం చేశారు. కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి సోమశేఖర్ రెడ్డి ఏర్పాటు చేసిన గజమాలను వాహనానికి వేయాల్సిందిగా షర్మిల సూచించారు.

టీడీపీ విజయమే లక్ష్యంగా పనిచేయాలి

బి.కొత్తకోట, ఏప్రిల్16: ఎన్నికలలో తెలుగుదేశం పార్టీ విజయమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పర్వీన్‌తాజ్ పేర్కొన్నారు. మంగళవారం బి.కొత్తకోట మండలంలోని గుమ్మసముద్రం, బడికాయలపల్లిలలో బీసీ సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ బీసీల సంక్షేమం కోసం టీడీపీ అధినేత చంద్రబాబు ప్రకటించిన బీసీ డిక్లరేషన్ ఎంతగానో తోడ్పడుతుందన్నారు. వైసీపీ ప్రభుత్వం స్థానిక సంస్థలలో బీసీలకు 34 శాతం వున్న రిజర్వేషన్లను 24 శాతానికి తగ్గించిందని ఎన్నికల్లో ఆ పార్టీకి తగిన బుద్ధిచెప్పాలని కోరారు. టీడీపీ అధికారంలోకి రాగానే బీసీలకు 50 ఏళ్లకే రూ.4వేలు పించన్ ఇస్తామని, సబ్‌ప్లాన్ , చంద్రన్న భీమా ద్వారా బీసీలకు అండగా ఉంటామన్నారు. కార్యక్రమంలో బీసీసెల్ జిల్లా అధ్యక్షుడు సురేంద్రయాదవ్, మండల కన్వీనర్ నారాయణస్వామిరెడ్డి, ప్రసాద్, నారా యణ, బంగారువెంకట్రమణ, గంజిమోహన, మనోహర్‌నాయుడు, రవికుమార్, గోవిందు, ఓబులేసు, శిల్పాఅంజి, కిట్టన్న, శ్రీనాథ్ పాల్గొన్నారు.

టీడీపీకి బీసీలే పట్టుకొమ్మలు...

నిమ్మనపల్లి, ఏప్రిల్ 16: టీడీపీకి బీసీలే పట్టుకొమ్మలని బీసీ నాయకుడు, మాజీ సర్పంచ్ రమణ పేర్కొన్నారు. మంగళవారం ముష్టూరు పంచాయతి వలసపల్లి జయహో బీసీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాని ముఖ్య అతిథిగా విచ్చేసిన టీడీపీ అధికార ప్రతినిధి ఆర్జే వెంకటేష్ మాట్లాడూతూ బీసీలకు చట్ట సభలలో ప్రాముఖ్యత కల్పించిన ఘనత చంద్రబాబుకే దక్కుతుందన్నారు. ప్రస్తుతం బీసీల కొరకు టీడీపీ 50ఏళ్లకే పింఛన్‌ను ప్రవేశపెట్టిదన్నారు. మే13న జరిగే ఎన్నికల్లో వైసీపీకి తగిన గుణపాఠం చెప్పి మదనపల్లె ఎమ్మెల్యేగా షాజహాన్‌బాషాకు సైకిల్ గుర్తుకు, రాజంపేట ఎంపీగా కిరణ్ కుమార్ రెడ్డికి కమలం గుర్తుపై ఓటు వేసి గెలిపించి చంద్రబాబుని ముఖ్యమంత్రిని చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రాజన్న, శ్రీపతి, రఫి, రెడ్డెప్ప, జయన్న, మల్లికార్జున, రెడ్డెప్ప, రమణ, షఫీ, ఖాసింఖాన్, అఫ్రోజ్, జయన్న, రామకృష్ణ, నరేంద్ర పాల్గొన్నారు.

పెద్దతిప్పసముద్రంలో: మండలంలోని మద్దయ్యగారిపల్లె పంచాయతీ కుమ్మరవారిపల్లెలో టీడీపీ నాయకులు బాబు ష్యూరిటీ - భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు ప్రవేశ పెట్టిన సూపర్ సిక్స్ పథకాల్లోని సంక్షేమ పథకాలను ఇంటింటికి వెళ్లి కరపత్రాలను టీడీపీ నాయకులు అందించారు. బీసీలకు రక్షణ చట్టం తీసుకోస్తామన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ చంద్రశేఖ ర్ (చిన్నా), సీనియర్ టీడీపీ నాయకులు బందార్ల వెంకట్రమణ, కార్యం సుబ్రమణ్యం, పాలగిరి రామాంజులు, పట్టెం చిన్నరెడ్డెప్ప, పట్టెం సుబ్బరాయప్ప, పట్టెం పెద్దరెడ్డెప్ప, ఓబులేసు, ఆదినారాయణ, రామచంద్ర, నరసింహులు, రాము, మస్తాన్ పాల్గొన్నారు.

కలకడలో:గ్రామాల్లో కనీస వసతుల కల్పన టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి లక్ష్యమని నాయకులు పేర్కొన్నారు. మంగళవారం కలకడ మండల టీడీపీ అధ్యక్షుడు పొత్తూరి ప్రభాకర్‌నాయుడు ఆధ్వర్యంలో బాబుష్యూరిటీ-భవిష్యత్ గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా బాటవారిపల్లె పంచాయతీ గరుడప్పగారిపల్లె, కొత్తగాండ్లపల్లె, ఆంజినేయవడ్డిపల్లె, బీసీ, ఎస్సీకాలనీలో ఇంటింటికి వెళ్లి కరపత్రాలను అందజేశారు. రాజంపేట పార్లమెంట్ కూటమి ఉమ్మడి అభ్యర్థి నల్లారి కిరణ్‌కుమార్‌రెడ్డి, పీలేరు నియోజకవర్గ అభ్యర్థి నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డిలను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర తెలుగు రైతు ఉపాధ్యక్షుడు మల్లారపు రవిప్రకాశ్, రాష్ట్ర అధికా ర ప్రతినిధి సూర్యప్రకాశ్, నాయకులు బరకం శ్రీనివాసులరెడ్డి, బీజేపీ కన్వీనర్ పొత్తూరి శ్రీకాంత్, రమణ, మల్లికార్జున్‌నాయుడు, కాంతారావు, విశ్వనాథ్, ఆర్. రమణ, సరస్వతమ్మ, తారకేశ్వర, చంద్ర మోహన్, త్యాగరాజు, మల్లికార్జున్‌నాయుడు, వెంకటరత్నం, చంద్రబాబు నాయుడు, శ్రీనివాసులరెడ్డి, ధనుంజయులు పాల్గొన్నారు.


బి.కొత్తకోటలో జయహో బీసీ సదస్సులో డిక్లరేషన్ కరపత్రాలు చూపుతున్న నాయకులు


నిమ్మనపల్లె బీసీ సభలో మాట్లాడుతున్న నాయకుడు రమణ, టీడీపీ అధికార ప్రతినిధి ఆర్జే వెంకటేష్

ఈవీఎంల పనితీరుపై అప్రమత్తంగా ఉండండి


పీవోలు, ఏపీవోలకు సూచనలిస్తున్న జాయింట్ కలెక్టర్ ఫర్హాన్ అహ్మద్

మదనపల్లె టౌన్, ఏప్రిల్ 16: ఎన్నికల సమయంలో ప్రతి పోలింగ్ కేంద్రంలో ఈవీఎంల పనితీరుపై పీవోలు, ఏపీవోలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా జాయింట్ కలెక్టర్ ఫర్హాన్ అహ్మద్ సూచించారు. మంగళవారం పట్టణంలోని బీటీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన పీవోలు, ఏపీవోల శిక్షణ కార్యక్రమానికి వచ్చిన జేసీ పలు అంశాలపై మాట్లాడారు. ఈవీఎంలు, వీవీప్యా ట్‌లు, సీయూ పనితీరుపై పీవోలు, ఏపీవోలను ప్రశ్నించారు. పోలింగ్ సమ యంలో ఏదైనా సమస్య వస్తే తీసుకోవాల్సిన నిర్ణయాలను వివరించారు. ఎప్పటి కప్పుడు ప్రతి గంట పోలింగ్ వివరాలను పై అధికారులకు తెలియజేయాలన్నా రు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్ర మంలో ఆర్డీవో హరిప్రసాద్, తహసీల్దార్ రమాదేవి పాల్గొన్నారు.

టీడీపీలో చేరిన పలువురు మైనారిటీలు

పీలేరు, ఏప్రిల్ 16: పీలేరు పట్టణం యల్లమంద క్రాస్, చిత్తూరు రోడ్డు ప్రాంతాలకు చెందిన పలువురు మైనారిటీలు మంగళవారం నల్లారి కిశోర్ కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో టీడీపీలో చేరారు. పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో కిశోర్ కుమార్ రెడ్డి వారందరికీ పసుపు కండువాలు కప్పి టీడీపీలోకి సాదరంగా ఆహ్వానించారు. గౌస్ బాషా, అబ్దుల్ రెహమాన్, మక్బూల్ బాషా, అన్సర్ బాషా, బషీర్, హజీర్, తదితరులు టీడీపీలో చేరిన వారిలో ఉన్నారు. ఈ కార్యక్రమంలో పీలేరు పట్టణానికి చెందిన టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

టీడీపీ గూటికి వైసీపీ నాయకులు

గుర్రంకొండ, ఏప్రిల్ 16:మండలంలోని మర్రిమాకులపల్లె పంచాయతీ శింగంవారిపల్లెకు చెందిన వైసీపీ నాయకులు సోమవారం రాత్రి టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి సమక్షంలో టీడీపీలో చేరారు. ఇందులో భాగంగా గ్రామానికి చెందిన ఎం.బయ్యారెడ్డితోపాటు 20 కుటుంబాలు పసుపు కండువాలను కప్పుకున్నారు. కార్యక్రమంలో నాయకులు జగదీష్, బయ్యారెడ్డి, రెడ్డెప్పరెడ్డి, మురళీ, చలమారెడ్డి, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

వాల్మీకిపురంలో: వాల్మీకిపురం మండలంలోని అయ్యవారిపల్లె గ్రామానికి చెందిన పలువురు వైసీపీ నాయకులు టీడీపీలో చేరారు. గ్రామానికి చెందిన నారాయణరెడ్డి, నరసింహారెడ్డి, కమలనాభరెడ్డి, హరినాథరెడ్డి, వెంకటరమణలతో పాటు మరో పదిమంది నాయకులు, కార్యకర్తలు మంగళవారం నగిరిపల్లెలో టీడీపీలో చేరగా పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి కిశోర్‌కుమార్‌రెడ్డి వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా స్వాగతించారు. ఈకార్యక్రమంలో నాయకులు దామోధర్‌రెడ్డి, సురేష్‌కుమార్‌రెడ్డి, చంద్రమోహన్‌రెడ్డి, దొరస్వామిరెడ్డి, ఎం.రమేష్‌రెడ్డి, సంతోష్, వివేకానందరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

వంట గ్యాస్ ప్రమాదాల పట్ల అవగాహన ఉండాలి

మదనపల్లె టౌన్, ఏప్రిల్ 16: గృహాలు, వాణిజ్య సముదా యాల్లో గ్యాస్ సిలెండర్ల నుం చి గ్యాస్ లీక్ అయ్యి జరిగే అగ్నిప్రమాదాలపై ప్రజలు అవగాహన పెంచుకోవాలని ఫైర్ ఆఫీసర్ శివప్ప పేర్కొన్నారు. మంగళవారం స్థానిక హెచ్‌పీ గ్యాస్ కార్యాలయం వద్ద ప్రజ లకు గ్యాస్ లీకేజి, అగ్నిప్రమా దాల నివారణపై అవగాహన కల్పించారు. అనంతరం అగ్ని మాపక వారోత్సవాల కరప త్రాలను పంపిణీ చేశారు. అగ్నిమాపక సిబ్బంది పాల్గొన్నారు.

ములకలచెరువు,లో: వంట గ్యాస్ ప్రమాదాల పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని అగ్నిమాపక సిబ్బంది అవగాహన కల్పించారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా స్థానిక ఇండేన్ గ్యాస్ ఆవరణలో మహిళలకు వంట గ్యాస్ సిలిండర్‌లో మంటలు చెలరేగి నప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి అవగాహన కల్పించారు. అగ్నిమాపక సిబ్బంది గణేష్‌కుమార్, వీరభద్రారెడ్డి, అల్లాబకష్, చలపతి, మనోజ్‌కు మార్, నాగభూషణరెడ్డి పాల్గొన్నారు.

వాల్మీకిపురంలో: వేసవి దృష్ట్యా వంటగ్యాస్ ప్రమాదాల పట్ల అప్రమత్తంగా ఉండాలని వాల్మీకిపురం అగ్నిమాపక కేంద్ర అధికారి మస్తాన్ పేర్కొన్నారు. మంగళవారం పట్టణం లోని జెట్టిపాలెంవీధి తదితర ప్రాంతాలలో వంట గ్యాస్ వల్ల సంభవించే ప్రమాదాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఫైర్ సిబ్బంది డెమో ద్వారా మహిళలకు అవగాహన కల్పించారు.